TS-11-0036701

నేటి చర్చ

జాతీయ తెలుగు దిన పత్రిక

అకారణంగా
ఎదురయ్యే విమర్శ
విజయానికి నాంది

- అబ్దుల్ కలాం Siri

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చన్యూస్ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

నేటి చర్చ జాతీయ తెలుగు దిన పత్రిక

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 01 సంచిక : 63 ఆదివారం, నవంబర్ 01, 2026 , పేజీలు - 12 వెల : 2/-

భారత వైమానిక దళ నూతన చీఫ్‌గా
అశుతోష్ దీక్షిత్

● నాలుగు దశాబ్దాల సైనిక అనుభవం..
3,500 గంటలకు పైగా విమాన ప్రయాణం


2లో

భారత నావిగేషన్ వ్యవస్థకు
కొత్త బలం..

ఇస్రో మరో చారిత్రాత్మక విజయం!

- ఎన్‌వీఎస్-03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతం..
జీపీఎస్‌కు స్వదేశీ ప్రత్యామ్నాయమైన నావిక్ వ్యవస్థకు మరింత సామర్థ్యం



హైదరాబాద్,అక్టోబర్ 31 : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అంతరిక్ష రంగంలో మరో కీలక విజయాన్ని నమోదు చేసింది. దేశీయ ఉపగ్రహ ఆధారిత నావిగేషన్ వ్యవస్థ 'నావిక్'ను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో చేపట్టిన ఎన్‌వీఎస్-03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా అక్టోబర్ 30న రాత్రి ఈ ప్రయోగాన్ని చేపట్టారు. ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టినట్లు ఇస్రో ప్రకటించింది. **స్వదేశీ సాంకేతికతకు ప్రాధాన్యం** ఎన్‌వీఎస్-03 ఉపగ్రహంలో భారత శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన స్వదేశీ అణు గడియారాన్ని అమర్చడం ఈ ప్రయోగంలో ప్రత్యేకత. దీనివల్ల అత్యంత కచ్చితమైన సమయ నిర్ధారణ, స్థాన గుర్తింపు మిగతా2లో...



హైదరాబాద్
నీటి కష్టాలకు చెక్..

నేటి నుంచే గ్రీన్ ట్యాంకర్ల సేవలు!
తాగునీటిని పాదుపు చేయడమే లక్ష్యం..
ఇతర అవసరాలకు శుద్ధి చేసిన నీరు
వినియోగించాలి : సీఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్,అక్టోబర్ 31 : హైదరాబాద్‌లో తాగునీటి వనరుల పరిరక్షణతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నవంబర్ 1 నుంచి గ్రీన్ ట్యాంకర్ల సేవలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మిగతా2లో...

పంజాబ్ ఎన్నికలకు ఆప్ తొలి జాబితా విడుదల

ధురి నుంచి సీఎం భగవంత్ మాన్ పోటీ.. 40 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ అవకాశం


2లో

ఎల్‌నినో ముప్పుపై అప్రమత్తం..

● తాగునీటి కోసం రూ.120 కోట్ల నిధులు! ● సింగూరు ఆధారిత జిల్లాలకు ప్రత్యేక కేటాయింపులు..
ఇతర జిల్లాలకు రూ.కోటి చొప్పున 2లో

తుమ్మిడిహెట్టి బ్యారేజీకి
కొత్త రూపురేఖలు..

ముంపు తగ్గించి నీటి వినియోగం పెంచడంపై దృష్టి!
మహారాష్ట్ర అభ్యంతరాలకు సాంకేతిక పరిష్కారాలు చూపాలి.. సాగునీటి లక్ష్యానికి విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలి: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



హైదరాబాద్,అక్టోబర్ 31 : తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్రలో తలెత్తుతున్న ముంపు, పర్యావరణ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు కనుగొనాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సాగునీటి లక్ష్యాలకు ఎలాంటి విఘాతం కలగకుండా పర్యావరణ ప్రభావాన్ని తగ్గించేలా సాంకేతిక మార్పులను పరిశీలించాలని సూచించారు. శనివారం సచివాలయంలో బ్యారేజీ అలైన్‌మెంట్లు, సాంకేతిక అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. బ్యారేజీ నిర్మాణం వల్ల ప్రభావితమయ్యే నదీ పరివాహక ప్రాంతాలు, అటవీ భూములు, పర్యావరణ సున్నిత ప్రాంతాలు, రక్షిత ప్రాంతాలు, రెవెన్యూ భూములు, జనావాసాలను మిగతా2లో...



జ్ఞానేశ్ కుమార్‌పై దేశద్రోహం
కేసు పెట్టాలి

● ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో బహిరంగ అభిశంసన.. సీఈసీపై ఆరు అభియోగాలు చదివిన ఖర్గే ● 2024 ఎన్నికల్లో అక్రమాలు.. 13.2 కోట్ల మంది ఓటర్ల తొలగింపు ఆరోపణలు ● ఓటు హక్కును హరించిన వారిని వదిలిపెట్టం: రాహుల్‌గాంధీ

అబద్ధాల్లో రేవంత్‌కు
ఆస్కార్

● మంచిరేవులలో రూ.2 వేల కోట్ల కుంభకోణం.. మియాపూర్ భూముల విక్రయానికి కలెక్టర్‌పై ఒత్తిడి ● హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాలు తాకట్టు పెట్టారని ఆరోపణ ● రూ.10 వేల కోట్ల రుణం కోసం రూ.400 కోట్ల కమీషన్ చెల్లించారని విమర్శ ● సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సవాల్



హైదరాబాద్,అక్టోబర్ 31 : అబద్ధాలు చెప్పడంలో ఆస్కార్ అవార్డు ఉంటే అది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. తాము చేసిన పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం క్రెడిట్ కొట్టేస్తోందని ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న భూ వ్యవహారాలపై పలు మిగతా2లో...

యాదాద్రీశుడి సన్నిధిలో గవర్నర్
దంపతులు.. ప్రత్యేక పూజలు!

యాదగిరిగుట్టలో తెలంగాణ వేద విద్వన్మహాసభలకు హాజరు.. వేద విద్య పరిరక్షణకు కృషి చేయాలని పిలుపు.. 2027 ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ


2లో

ఎలక్ట్రానిక్స్ తయారీ
కేంద్రంగా తెలంగాణ

తుక్కుగూడలో
రూ.200 కోట్లతో మివి పరిశ్రమ!
2,500 మందికి ఉపాధి
కల్పించేలా అత్యాధునిక తయారీ కేంద్రం.. ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు


2లో

జ్ఞానేశ్ కుమార్‌పై దేశద్రోహం కేసు పెట్టాలి

న్యూఢిల్లీ,అక్టోబర్ 31: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై దేశద్రోహం కేసు నమోదు చేసి విచారణ జరపాలని రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో శనివారం ఢిల్లీలోని ఖర్గే నివాసంలో బహిరంగ అభిశంసన కార్యక్రమం నిర్వహించారు. లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఈసీపై ఆరు అభియోగాలను ఖర్గే చదివి వినిపించారు.ఎన్నికల ప్రక్రియను దెబ్బతీ యడం, ఓటర్ల జాబితాలో అక్రమాలు, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరచడం వంటి అంశాలను అభియోగాలుగా పేర్కొన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదేశాల మేరకు జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘాన్ని నడుపుతున్నారని ఖర్గే ఆరోపించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐ ఆర్) ప్రక్రియలో 13.2 కోట్ల మంది ఓటర్ల పేర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారని విమర్శించారు.ప్రజల ఓటు హక్కును హరించి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హెచ్చరించారు. ఓటర్ల జాబితాల నుంచి కోట్లాది మంది పేర్ల తొలగింపుపై ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సోనియాగాంధీ, ప్రియాంకాగాంధీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ తదితర ఇండియా బ్లాక్ నేతలు పాల్గొన్నారు. అనంతరం అభిశంసన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

యాదాద్రీశుడి సన్నిధిలో గవర్నర్ దంపతులు.. ప్రత్యేక పూజలు!

యాదాద్రి భువనగిరి,అక్టోబర్ 31 : తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా శనివారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న గవర్నర్ దంపతులకు అర్చకులు పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందజేశారు.**వేద విద్వన్మహాసభలకు హాజరు** శ్రీ జనార్ధనానంద సరస్వతి స్వామి సంస్మృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి యాదగిరిగుట్టలో నిర్వహిస్తున్న తెలంగాణ వేద విద్వన్మహాసభలకు గవర్నర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వేద విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రాచీన వేద విజ్ఞానాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వేదాలు ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి పరిరక్షణ, నైతిక విలువలు, జీవన విధానంపై ఎంతో జ్ఞానాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.

2027 ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ ఈ సందర్భంగా యాదాద్రి దేవస్థానం రూపొందించిన 2027 నూతన వార్షిక క్యాలెండర్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని గవర్నర్ సూచించారు.

భారత నావిగేషన్ వ్యవస్థకు కొత్త బలం..

(మొదటి పేజీ తరువాయి)

సేవలకు మరింత అవకాశం కలగనుంది. ఇప్పటికే ఉన్న ఎల్5, ఎస్ బ్యాండ్లకు అదనంగా ఎల్1 సిగ్నల్‌ను కూడా ఇందులో ప్రవేశపెట్టారు. దీంతో ఆధునిక మొబైల్ పరికరాలు, ఇతర నావిగేషన్ వ్యవస్థలకు అనుసంధాన సామర్థ్యం పెరగనుంది. **1,500 కిలోమీటర్ల పరిధిలో సేవలు**భారత భూభాగంతో పాటు దేశ సరిహద్దుల చుట్టూ సుమారు 1,500 కిలోమీటర్ల పరిధిలో నావిక్ వ్యవస్థ ద్వారా స్థాన నిర్ధారణ, దిశానిర్దేశం, సమయ సేవలు అందించేందుకు వీలుంటుంది. రైళ్ల రాకపోకల పర్యవేక్షణ, వాహనాల ట్రాకింగ్, నౌకాయానం, వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, రక్షణ రంగాల్లో ఈ వ్యవస్థ కీలకంగా ఉపయోగపడనుంది.**నావిక్ వ్యవస్థకు పునరుత్తేజం** నావిక్ వ్యవస్థలో కనీస కార్యాచరణకు అవసరమైన నాలుగు ఉపగ్రహాల సంఖ్యను ఈ ప్రయోగం ద్వారా పునరుద్ధరించినట్లు ఇస్రో ఛైర్మన్ తెలిపారు. ఉపగ్రహాన్ని తుది కక్ష్యలోకి చేర్చేందుకు తదుపరి దశల కక్ష్య మార్పులు కొనసాగనున్నాయి. ఈ విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లను అభినందించారు. స్వదేశీ అంతరిక్ష సాంకేతికతలో స్వయం సమృద్ధి సాధించే దిశగా ఈ ప్రయోగం మరో కీలక ముందడుగుగా నిలిచింది.

హైదరాబాద్ నీటి కష్టాలకు చెక్..

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. మురుగునీటి శుద్ధి కేంద్రాల నుంచి సరఫరా చేసే నీటి నాణ్యతను అధికారులు నిరంతరం పరిశీలించాలని స్పష్టం చేశారు.**ప్రత్యేక యాప్ ద్వారా గ్రీన్ ట్యాంకర్ల బుకింగ్** గ్రీన్ ట్యాంకర్ల ద్వారా అవసరానికి అనుగుణంగా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. దీనిద్వారా ప్రజలు సులభంగా ట్యాంకర్లను బుక్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. సరఫరా చేసిన శుద్ధి నీటి పరిమాణంపై హైదరాబాద్ జలమండలి ఎండీ రోజువారీ నివేదిక సమర్పించాలని సీఎస్ ఆదేశించారు. **నవంబర్ 15 నాటికి అదనపు నీటి పథకం** మిషన్ భగీరథ కింద అదనంగా రోజుకు 40 మిలియన్ గ్యాలన్ల నీటిని అందించే పథకాన్ని నవంబర్ 15 నాటికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. విలీనమైన పట్టణ స్థానిక సంస్థలకు వచ్చే ఏడాది ఆగస్టు వరకు బల్క్ వాటర్ సరఫరా కొనసాగించాలని తెలిపారు.

నీటి పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపడుతున్న 'సేవ్ వాటర్' ప్రచారం ద్వారా వ్యక్తులు, సంస్థలు, పరిశ్రమల్లో నీటి వినియోగాన్ని 20 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంజయ్ జాజు వెల్లడించారు. తాగునీటి వనరులను కాపాడుకుంటూ నగర ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

అబద్ధాల్లో రేవంత్‌కు ఆస్కార్

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలు చేశారు.**మంచిరేవులలో రూ.2 వేల కోట్ల కుంభకోణం** మంచిరేవుల గ్రేహౌండ్స్ భూముల కేసులో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోయిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. 2017లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో న్యాయపోరాటం చేసి, 2021లో హైకోర్టు డివిజన్ బెంచ్‌లో విజయం సాధించామని తెలిపారు. 2023 ఆగస్టు 1న సుప్రీంకోర్టు 142 ఎకరాలు ప్రభుత్వానివేనని తుది తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. ఎకరం రూ.100 కోట్లు పలికే ప్రాంతంలో ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. మంచిరేవులలో మొత్తం రూ.2 వేల కోట్ల కుంభకోణం జరిగిందని విమర్శించారు.**మియాపూర్ భూములపై ఒత్తిడి** మియాపూర్ భూములపై కోర్టు తీర్పు ప్రతులు చేతికి రాకముందే వాటిని విక్రయించాలంటూ కలెక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఆ భూముల విషయంలో ఎవరెవరి నుంచి ముందస్తు చెల్లింపులు తీసుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. గోల్డ్‌స్టోన్ ప్రసాద్ సోదరుడిని జైలుకు పంపింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై అప్పట్లో చర్యలు తీసుకున్నామని వివరించారు.**హెచ్‌సీయూ భూములు తాకట్టు** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో తాకట్టు పెట్టారని హరీశ్‌రావు ఆరోపించారు. రూ.10 వేల కోట్ల రుణం కోసం ముంబైకి చెందిన బ్రోకర్‌కు రూ.400 కోట్ల కమీషన్ ఇచ్చారని విమర్శించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, తుంగ బాలు తదితరులు పాల్గొన్నారు



నెహ్రూకు ప్రధాని పీఠం.. పటేల్‌కు అన్యాయం!

- కాంగ్రెస్‌పై కిషన్‌రెడ్డి ధ్వజం
- దేశ తొలి ప్రధాని ఎంపికలోనే ఓటు చోరీ జరిగిందని ఆరోపణ.. పటేల్ సేవలను స్మరించుకుంటూ కాంగ్రెస్ రాజకీయాలపై విమర్శలు

హైదరాబాద్,అక్టోబర్ 31:

దేశ స్వాతంత్ర్యానంతరం ప్రధాని ఎంపిక సమయంలోనే ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరించారని కేంద్ర మంత్రి, బీజేపీ నేత జి. కిషన్‌రెడ్డి కాంగ్రెస్‌పై ఆరోపణలు గుప్పించారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు లభించాల్సిన ప్రధానమంత్రి పదవిని జవహర్‌లాల్ నెహ్రూకు కట్టబెట్టారని, ఇదే దేశంలో తొలి ఓటు చోరీ అని వ్యాఖ్యానించారు.పటేల్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించిన కిషన్‌రెడ్డి.. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడంలో పటేల్ పోషించిన పాత్రను కొనియాడారు. ఆపరేషన్ పోలో ద్వారా నిజాం పాలనకు ముగింపు పలకడంలో ఆయన కీలకంగా వ్యవహరించారని గుర్తుచేశారు. దేశ ఐక్యత కోసం పటేల్ చేసిన సేవలను యువత గుర్తించాలని పిలుపునిచ్చారు.

భారత వైమానిక దళ నూతన చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్

న్యూఢిల్లీ,అక్టోబర్ 31: భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నూతన చీఫ్‌గా ఎయి ర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి. సింగ్ స్థానంలో ఆయన నియమితులయ్యారు. గతంలో వైమానిక దళ వైస్ చీఫ్‌గా, ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌లో కీలక బాధ్యతలు నిర్వహించారు.దాదాపు నాలుగు దశాబ్దాల సైనిక అనుభవం కలిగిన దీక్షిత్ ఫైటర్, టెస్ట్ పైలట్‌గా వివిధ రకాల విమానాల్లో 3,500 గంటలకు పైగా ప్రయాణించారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, కోప్ ఇండియా, ఆపరే షన్ సిందూర్ వంటి కీలక సైనిక కార్యకలాపాలు, విన్యాసాల్లో పాల్గొన్నారు. వైమానిక దళ కార్యక లాపాలు, వ్యూహాత్మక ప్రణాళికలు, ఆధునికీకరణ రంగాల్లో ఆయనకు విశేష అనుభవం ఉంది.

పంజాబ్ ఎన్నికలకు ఆప్ తొలి జాబితా విడుదల

న్యూఢిల్లీ,అక్టోబర్ 31:

2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తొలి జాబితాలో 40 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ధురి నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. మంత్రి సంజీవ్ అరోరాకు లూథియానా వెస్ట్ టికెట్ కేటాయించింది. అసెంబ్లీ స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వాన్‌కు కోట్కాపురా నుంచి అవకాశం కల్పించింది. జాబితాలో 40 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మరోసారి టికెట్లు కేటాయించడం విశేషం.

ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా తెలంగాణ

హైదరాబాద్,అక్టోబర్ 31: తెలంగాణ పారిశ్రామిక రంగంలో మరో భారీ పెట్టుబడి అడుగుపెట్టింది. ప్రముఖ స్వదేశీ ఎలక్ట్రానిక్స్ సంస్థ మివి రూ.200 కోట్ల వ్యయంతో రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో అత్యాధునిక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఆవిష్కరణ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ పరిశ్రమను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు.ఈ కేంద్రంలో ఇయర్‌బడ్స్, హెడ్‌ఫోన్స్, స్పీకర్లు, సౌండ్‌బార్లు తదితర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను తయారు చేయనున్నారు. నెలకు ఐదు లక్షల ఇయర్‌బడ్స్, 75 వేల సౌండ్‌బార్ల తయారీ సామర్థ్యంతో పరిశ్రమను రూపొందించారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 2,500 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తెలంగాణను దేశంలోనే ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తూ, పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో తయారీ రంగం 7.7 శాతం వృద్ధి సాధించడం పారిశ్రామిక పురోగతికి నిదర్శనమని వివరించారు.

ఎల్‌నినో ముప్పుపై అప్రమత్తం..

- తాగునీటి కోసం రూ.120 కోట్ల నిధులు!
- సింగూరు ఆధారిత జిల్లాలకు ప్రత్యేక కేటాయింపులు.. ఇతర జిల్లాలకు రూ.కోటి చొప్పున మంజూరు



హైదరాబాద్,అక్టోబర్ 31: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం సింగూరు ప్రాజెక్టు పరిధిలోని జిల్లాలకు రూ.120 కోట్లు మంజూరు చేసినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క వెల్లడించారు. శనివారం హైదరాబాద్ నుంచి గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ఇంజినీర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో తాగునీటి అవసరాల కోసం ఈ నిధులను వినియోగించనున్నట్లు తెలిపారు. ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం రూ.కోటి చొప్పున కేటాయించినట్లు పేర్కొన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి బోరుబావులను అద్దెకు తీసుకుని, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేతిపంపులు, బావులు, స్థానిక నీటి వనరులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.**రెండు రోజుల్లో ఇంకుడు గుంతల పనులు పూర్తి** ఇటీవల కురిసిన వర్షపు నీటిని భూగర్భ జలాల పెంపునకు వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. తాగునీటి వనరుల సమీపంలో ఇంకుడు గుంతలు, మ్యాజిక్ సోక్ పిట్‌ల నిర్మాణాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం, నీటి పొదుపు ప్రాధాన్యంపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరాలో ఎక్కడా అంతరాయం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీతక్క స్పష్టం చేశారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీకి కొత్త రూపురేఖలు..

(మొదటి పేజీ తరువాయి)

గుర్తిస్తూ సమగ్ర పటాలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. వివిధ నీటిమట్టాల వద్ద ఎంత మేరకు భూమి ముంపునకు గురవుతుందో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలని ఆదేశించారు. మహారాష్ట్ర అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ఇంజినీరింగ్ మార్పుల ద్వారా సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు.**152 మీటర్ల ఎత్తుకు తెలంగాణ ప్రతిపాదన**ప్రస్తుతం తుమ్మిడిహెట్టి బ్యారేజీ పూర్తి స్థాయి నీటిమట్టాన్ని 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. 152 మీటర్ల ఎత్తుతో నీటి నిల్వ సామర్థ్యం 5.697 టీఎంసీలకు పెరుగుతుందని, 148 మీటర్ల వద్ద ఇది 2.182 టీఎంసీలుగా ఉంటుందని అధికారులు వివరించారు. ఈ బ్యారేజీ ద్వారా 77 టీఎంసీల నీటిని మళ్లించేలా ప్రణాళిక రూపొందించారు. **5.85 లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం** తుమ్మిడిహెట్టి బ్యారేజీ, సుందిళ్ల బ్యారేజీ, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల అనుసంధానంతో ఏడు జిల్లాల్లో 5.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముంపు, పునరావాస సమస్యలను పరిష్కరిస్తూనే ప్రాజెక్టు సాగునీటి ప్రయోజనాలు దెబ్బతినకుండా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు. మహారాష్ట్రతో ఇటీవల జరిగిన చర్చల నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య సమన్వయంతో ముందుకు

దేశ ఐక్యతకు పటేల్ జీవితం స్ఫూర్తిదాయకం

జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



చర్చ, జగిత్యాల: దేశ ఐక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

=ధ దమ్మపేట మండలానికి చెందిన వ్యక్తి అశ్వారావుపేటలో ఆత్మహత్య.



చర్చ:- అశ్వారావుపేటకుటుంబ కలహాలు, మద్యానికి బానిసైన పరిస్థితుల్లో ఓ వ్యక్తి గుర్తుతెలియని పురుగుల మందు తాగి మృతి చెందిన ఘటన అశ్వారావుపేట మండలంలో చోటుచేసుకుంది.
వివరాల్లోకి వెళితే..దమ్మపేట మండలం రంగువారిగూడెం గ్రామానికి చెందిన చింతల హరీష్ (32), తండ్రి ప్రకాష్ రావు గత కొంతకాలంగా మద్యానికి బానిసై ఎలాంటి పని చేయకుండా కుటుంబ పోషణను పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఈ క్రమంలో భార్య మందలించడంతో మనస్తాపానికి, ఆగ్రహానికి గురైన హరీష్ అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం గ్రామంలోని తన అక్క ఇంటికి వెళ్లాడు.అక్క ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన అక్క హరీష్ పరిస్థితిని గమనించి వెంటనే చికిత్స నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. అయితే ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.ఈ ఘటనపై మృతుడి భార్య అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ బి. కిషోర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు హరీష్‌కు ఇద్దరు కుమారులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వర్షానికి అదుపుతప్పి చెరువులో బోల్తాపడిన ట్రాక్టర్.. వ్యక్తి మృతి

ట్రాక్టర్ ఇంజన్ కింద చిక్కుకుని ప్రాణాలు కోల్పోయిన రైతు.
కుమారుడికి తప్పిన ప్రమాదం.



చర్చ :- అశ్వారావుపేటవర్షం కారణంగా ట్రాక్టర్ అదుపుతప్పి చెరువులో బోల్తా పడటంతో ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన అశ్వారావుపేట మండలంలోని గుర్రాల చెరువు గ్రామ శివారులో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే.. గుర్రాల చెరువు గ్రామ శివారులోని కొబ్బరి తోట ముఖద్వారం వద్ద నివాసం ఉంటున్న బసబోయిన సాంబశివరావు (40), తండ్రి నరసింహులు తన కుటుంబంతో కలిసి కొబ్బరి తోటలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంట్లోని చెత్తను తొలగించేందుకు గురువారం ఉదయం తన కుమారుడిని ట్రాక్టర్‌లో పక్కన కూర్చోబెట్టుకుని చెత్త పారవేసేందుకు బయలుదేరాడు.గ్రామ శివారులోని చెరువు కట్టపై నుంచి వెళ్తుండగా, వర్షం కారణంగా ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న చెరువులో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సాంబశివరావు ట్రాక్టర్ ఇంజన్ కింద చిక్కుకుపోగా, అతని కుమారుడు పక్కకు పడిపోయాడు. అదృష్టవశాత్తూ బాలుడికి ఎలాంటి గాయాలు కాలేదు.ప్రమాదం నుంచి బయటపడిన కుమారుడు వెంటనే ఇంటికి వెళ్లి తల్లికి సమాచారం అందించడంతో ఆమె గ్రామస్తులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుంది. గ్రామస్తుల సహాయంతో ట్రాక్టర్ కింద చిక్కుకున్న సాంబశివరావును బయటకు తీసి చికిత్స నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతుడి భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి. కిషోర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుమారుడు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నప్పటికీ, కుటుంబంలో విషాదం అలుముకుంది.

హేమచంద్రపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవ(ఏక్తా దివాస్) వేడుకలు





నేటి చర్చ : ఎస్పీ కార్యాలయం.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.తేదీ: 31.10.2026, దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హేమచంద్రపురంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, భారతదేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని అనేక సంస్థానాలను ఏకీకృతం చేసి, భారతదేశ సమగ్రతకు, ఐక్యతకు పునాది వేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి అపారమని కొనియాడారు. ఆయన దృఢ సంకల్పం, నాయకత్వ లక్షణాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.దేశ సమగ్రత, ఐక్యతను కాపాడటంలో పోలీస్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజలకు న్యాయం అందించేలా, చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేలా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీసింగ్‌లో క్రమశిక్షణ, నిబద్ధత, పారదర్శకత, ప్రజల పట్ల గౌరవం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడటానికి అంకితభావంతో పనిచేస్తామని, దేశ సమైక్యతను మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్య నాయక్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి

చంద్రుగొండలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ శ్రేణులు.



చర్చ :- చంద్రుగొండ.భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, భారతరత్న, ఉక్కు మహిళగా పేరుగాంచిన దివంగత ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలను చంద్రుగొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్లమోతు వెంకటరమణ ఆధ్వర్యంలో మండల ప్రధాన కూడలిలోని ఇందిరా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె దేశానికి అందించిన సేవలను, ప్రధానమంత్రిగా చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను నాయకులు స్మరించుకున్నారు.
దేశ రాజకీయాల్లో మహిళగా అత్యున్నత పదవిని అధిరోహించి, భారతదేశ చరిత్రలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని పేర్కొన్నారు.దేశ సమగ్రత, ఐక్యత కోసం ఇందిరా గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. ఆమె ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, చంద్రుగొండ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొని ఇందిరా గాంధీకి ఘన నివాళులర్పించారు.

భద్రాచలం డిఎస్పి ఆధ్వర్యంలో చెన్నాపురం, ఎర్రంపాడు గిరిజన గ్రామాల్లో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం -- 100 మంది చిన్నారులకు దుస్తుల పంపిణీ



నేటి చర్చ :డిఎస్పీ కార్యాలయం, భద్రాచలం, తేదీ:31.10.2026, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు, భద్రాచలం డిఎస్పీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో చర్ల మండల పరిధిలోని చెన్నాపురం, ఎర్రంపాడు గిరిజన గ్రామాల్లో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా రెండు గ్రామాలకు చెందిన 100 మంది చిన్నారులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భద్రాచలం డిఎస్పీ గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన గ్రామాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, ప్రజలకు అవసరమైన సమయంలో పోలీస్ శాఖ అండగా ఉంటుందని తెలిపారు.అనంతరం చిన్నారుల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని, వారికి మెరుగైన విద్యను అందించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజు వర్మ, ఎస్సై నర్సిరెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతి ఐక్యతకు పునాదులు వేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్: జిల్లా కలెక్టర్ అంకిత్





నేటి చర్చ : కలెక్టరేట్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,రాష్ట్ర ఐక్యతా దినోత్సవం సందర్భంగా పటేల్ చిత్రపటానికి ఘన నివాళులు.
అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఐడీఓసీ కార్యాలయంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ ఐక్యతా దినోత్సవం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఆర్ఓ పద్మావతితో కలిసి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రజలంతా బేధాభిప్రాయాలను విడనాడి జాతీయ ఐక్యతా భావంతో మెలగాలని సూచించారు. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ నుంచి మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి గొప్ప నాయకులు ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేశారని తెలిపారు. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం లభించిన అనంతరం సుమారు 500 సంస్థానాల విలీనం పెద్ద సవాలుగా మారిందని అన్నారు . ఆ సమయంలో ఎంతో చాకచక్యంగా వ్యవహరించిన భారత తొలి ఉప ప్రధాని, కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సంస్థానాల విలీనం కోసం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. తన దృఢ సంకల్పం, కార్యదక్షతతో సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి జాతీయ సమైక్యతకు బలమైన పునాదులు వేశారని కొనియాడారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన ఐక్యతా మార్గంలో దేశం ముందుకు సాగుతూ ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం, సమైక్యత కోసం జాతీయ నాయకులు చేసిన పోరాటాలు, త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, వారి స్ఫూర్తితో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జాతి మొత్తం ఐక్యత, సమగ్రత, సోదరభావంతో మెలగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిపిఓ సునీత, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, డీపీఓ అనూష, బీసీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, ఓఎస్డీ వెంకటరమణతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ పటేల్ జయంతి.. ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమాలు



చర్చ :- అశ్వారావుపేట.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం నారాయణపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలిచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మడకం కుమారి ఆంధ్రయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ మడకం కుమారి ఆంధ్రయ్య సర్దార్ వల్లభాయ్ పటేల్, ఇందిరాగాంధీల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి దేశసేవలను, ప్రజలకు అందించిన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలోని అనేక సంస్థానాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి దేశ సమగ్రత, సమైక్యతకు పునాదులు వేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. ఆయన ధైర్యసాహసాలు, దృఢ సంకల్పం, దేశం పట్ల అంకితభావం కారణంగానే ఆయన ఉక్కు మనిషిగా దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన సేవలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.అదేవిధంగా ఇందిరాగాంధీ భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా దేశానికి విశేష సేవలు అందించారని గుర్తుచేశారు. దేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో ఆమె తీసుకున్న నిర్ణయాలు, దేశ అభివృద్ధికి చేసిన కృషి చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని తెలిపారు.మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు ఆమె నాయకత్వం స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహనీయుల జీవితాలు, వారి త్యాగాలు, సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.దేశం కోసం జీవితాలను అంకితం చేసిన మహానుభావులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, వారి ఆశయాలు, విలువలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు సభ్యుడు మడకం ఆంధ్రయ్య, తొమ్మిదో వార్డు సభ్యుడు కుంజా రాంబాబు, గ్రామపంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్





నేటి చర్చ : కొత్తగూడెం, అక్టోబర్ - 31,భారత ప్రభుత్వ యువజన సర్వీసులు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ, మై భారత్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ లో ఘనంగా జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బి. అనూష – జిల్లా పంచాయతీ అధికారి, జగన్ మోహన్ రాజు – కళాశాల ప్రిన్సిపాల్, కామేశ్వర్ రావు – ఎన్.ఎస్.ఎస్ జిల్లా కోఆర్డినేటర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మేరా యువ భారత్ అధికారి ఎం. వెంకట్ రాంబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమం ఉద్దేశం యువతలో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, దేశాభివృద్ధి పట్ల అవగాహన పెంపొందించే లక్ష్యంతో జిల్లాస్థాయి విక్షిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో యువత తమ ఆలోచనలు, అభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తపరిచేందుకు ఈ కార్యక్రమం ఒక మంచి వేదికగా నిలుస్తుందని బి. అనూష అన్నారు, యువతలో పార్లమెంటరీ వ్యవస్థ, రాజ్యాంగ విలువలు, పౌర బాధ్యతలు, దేశ నిర్మాణంలో యువత పాత్రపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని డిస్టిక్ యూత్ అధికారి రాంబాబు అన్నారు. ఈ “వన్ నేషన్ – వన్ ఎలక్షన్” అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 58 విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో బి. నవదీప్ రెడ్డి, జి. మేఘన, జి. పావని జిల్లాస్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎన్నికవ్వడం జరిగింది.

అంకితమైన పోలీస్ సేవలకు ఘన వీడ్కోలు

విధులకు ముగింపే..
కొత్త అధ్యాయం మొదలుబి
జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



చర్చ, జగిత్యాల: పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ మహమ్మద్ అలీముద్దీన్, ఏఆర్ఎస్ఐ అహ్మద్ ఖాన్‌లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఘనంగా సన్మానించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం కేవలం వృత్తి మాత్రమే కాదని, సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని అన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో ఉద్యోగ విరమణ పొందిన అధికారుల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఉద్యోగ విరమణతో విధులకు మాత్రమే ముగింపు ఉంటుందని, జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రిటైర్డ్ అధికారులు కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆరోగ్యంగా జీవించాలని ఎస్పీ ఆకాంక్షించారు.

"చర్చ" వార్తకు స్పందన

కల్లెడ స్కూల్లో ఎంఈవో ఆకస్మిక పర్యటన

చర్చ, జగిత్యాల 31: "భార్య నౌఖరి భర్త పెత్తనం " శీర్షిక తో చర్చ దీనపత్రికలో ప్రచురితమైన వార్త కు మండల విద్యాధికారి గంగాధర్ స్పందించారు. శుక్రవారం వార్త ప్రచురితమైన రోజే ఎం ఈ వో ఆకస్మికగా వెళ్లారు. కల్లెడ ప్రభుత్వ హై స్కూల్ లోకి వెళ్లిన ఎం. ఈ. వో కు ప్రధానోపాధ్యారాలు భర్త అక్కడే కనిపించాడు. చర్చ లో వచ్చిన వార్త పై ఎం. ఈ. వో ఆరాతీయగా గత ఏడాది నుంచి తన భర్త స్కూల్ కు వస్తున్నట్లు హెచ్. ఎం ఒప్పుకొన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. పత్రికలో వచ్చిన సమాచారం పై పూర్తి వివరాలను సేకరించిన ఎం.ఈ.వో గంగాధర్ పూర్తి నివేదికను డి. ఈ. వో కు అందజేస్తున్నట్లు గ్రామస్తుల ద్వారా అందిన సమాచారం.



ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం



నేటి చర్చ :- హుస్నాబాద్/ అక్కన్నపేట :అక్కన్నపేట, మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. భారత తొలి మహిళా ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం, వ్యవసాయ రంగ పురోగతి, జాతీయ ఐక్యత, సమగ్రత కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. దేశ రక్షణ, అభివృద్ధి కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు భారత చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని గుర్తుచేశారు. ఆమె ఆశయాలు, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లడమే ఇందిరాగాంధీకి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు చింతల మల్లారెడ్డి, సర్పంచ్ చిన్న నాయక్, పంగ రాకేష్, బొమ్మ అభిలాష్, ముని రాజు, గంగారపు కొమురయ్య, మహేందర్, వల్లపు రాజు, సదయ్య, ఎండి అక్బర్ బాషా, మంద మహేందర్, దేవనూరి రాజు, కాశివేణి ఎల్లయ్య, ఎలిషాని వెంకటయ్య, నక్క కొమురయ్య, నక్క బాలయ్య, అనిల్, బోయిని గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి సీపీఐని బలోపేతం చేయాలి

ప్రజా సమస్యలపై ఐక్యంగా పోరాడాలి
సీపీఐ మండల కార్యదర్శి వెల్పుల శ్రీనివాస్.



నేటి చర్చ:- హుస్నాబాద్/ కోహెడ : సీపీఐ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి వెల్పుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కోహెడ మండల కేంద్రంలో శనివారం ఆయన అధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అన్యాయాలు, అక్రమాలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.
భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను, ప్రజా పోరాటాల్లో పార్టీ పోషించిన పాత్రను, సాధించిన విజయాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎన్నో ఒడిదొడుకులు ఎదురైనా కార్మికులు, కర్షకులు, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం సీపీఐ నిరంతరం పోరాడుతోందని పేర్కొన్నారు.
ఈ సమావేశంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి బొనగిరి శంకర్, సీనియర్ నాయకులు బండారి లక్ష్మణ్, మహేందర్ రెడ్డి, తాళ్లపల్లి ఎల్లయ్య గౌడ్, చింతలపల్లి బాలరెడ్డి, జాగిరి బలయ్య, చిట్యాల శేఖర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కందుకూరి మహేష్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి రాసూరి యుగేందర్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎర్ర శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నాటు తుపాకులతో వన్యప్రాణుల వేటకు యత్నం.. ముగ్గురి అరెస్ట్

రెండు నాటు తుపాకులు, మందుగుండు సామగ్రి స్వాధీనం.

చర్చ :- దమ్మపేట.అడవి జంతువులను అక్రమంగా వేటాడేందుకు నాటు తుపాకులతో వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను దమ్మపేట పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు నాటు తుపాకులతో పాటు మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. చెన్నువారిగూడెం గ్రామ శివారు ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..
దమ్మపేట మండలం చెన్నువారిగూడెం గ్రామ శివారు ప్రాంతంలోని అటవీ పరిసరాల్లో వన్యప్రాణులను వేటాడేందుకు కొందరు వ్యక్తులు నాటు తుపాకులతో సంచరిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు తనిఖీలు చేపట్టి వేటకు వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా కారం నాగేంద్రబాబు (34), కారం చిట్టిబాబు (27), మోడియం సురేంద్రబాబు (25)గా గుర్తించారు. వీరు గత కొంతకాలంగా తమ వద్ద ఉన్న నాటు తుపాకులతో సమీప అటవీ ప్రాంతాల్లో అడవి జంతువులను వేటాడుతున్నట్లు పోలీసుల విచారణలో



వెల్లడైనట్లు సమాచారం.
నిందితుల వద్ద నుంచి రెండు నాటు తుపాకులు, సుమారు 100 గ్రాముల నల్లటి గన్‌పౌడర్, 37 చిన్న ఇనుప గుండ్లు, ఇతర మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇదే వ్యవహారానికి సంబంధించి మరో నిందితుడిగా పేర్కొన్న పెనుబల్లి శ్రీను ఇప్పటికే దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన మరో కేసులో అరెస్టయి ప్రస్తుతం జైలులో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాల్లో అక్రమంగా నాటు తుపాకులతో సంచరిస్తూ వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు.




అడవి జంతువులను వేటాడి వాటి మాంసాన్ని విక్రయించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
వన్యప్రాణులు ప్రకృతి సమతుల్యతలో కీలక పాత్ర పోషిస్తాయని, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు.
అటవీ సంపదను, వన్యప్రాణులను కాపాడేందుకు ప్రజలు పోలీసు, అటవీ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వన్యప్రాణుల వేటకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.
ఈ పోలీసు చర్యల్లో అశ్వారావుపేట సీఐ నాగరాజు, దమ్మపేట ఎస్సై రాజేష్ కుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ గిరిజన యువతి యువకులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకొని జీవనోపాధికి మార్గం సుగమం చేసుకోవాలి

నేర్చుకున్న శిక్షణాలను సద్వినియోగం చేసుకొని సొంతంగా వ్యాపార మార్గాలు రూపొందించుకోవాలి
శిక్షణతో పాటు ఆదాయ మార్గాలకు సంబంధించిన విషయాలు తెలుసుకోవాలి
ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్

నేటి చర్చ:కొత్తగూడెం 31 అక్టోబర్ 26 పై చదువులు చదువుకొని ఖాళీగా ఉండకుండా మీకు ఇష్టమైన వృత్తులలో శిక్షణ తీసుకొని వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకొని జీవనోపాధికి మరియు ఆదాయ మార్గాలు తెలుసుకొని సొంతంగా వ్యాపారం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకోవాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ యువతులకు సూచించారు.శనివారం నాడు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ప్రగతి మైదానంలోని మున్సిపల్ భవనములో ఐటీడీఏ ద్వారా గిరిజన యువతులకు వివిధ వృత్తులలో నైపుణ్యాల శిక్షణ అందిస్తున్న వై టి సి ని సందర్శించి, ఇప్పటివరకు శిక్షణ పొందిన శిక్షణార్థుల సంఖ్య, ప్రస్తుతం శిక్షణ పొందుతున్న శిక్షణార్థులు అలాగే రాబోయే బ్యాచులకు సంబంధించిన వివరాలను సమీక్షించిన అనంతరం



వివిధ కోర్సులలో శిక్షణ తీసుకుంటున్న గిరిజన యువతలను నేర్చుకున్న శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా గిరిజన యువతులకు పలు సూచనలు ఇస్తూ బ్యూటీషియన్, టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్, గెస్ట్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ శిక్షణ తీసుకుంటున్న మహిళలతో చాలా శ్రద్ధతో శిక్షణ తీసుకోవాలని అన్నారు. తీసుకున్న శిక్షణను వృధా చేయకుండా తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.శిక్షణ తీసుకుంటున్న యువతులు శిక్షకులు అందిస్తున్న బ్యూటీషియన్, ఎంబ్రాయిడరింగ్, టైలరింగ్, గెస్ట్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ శిక్షణ తీసుకున్న యువతులు సొంతంగా వ్యాపారాలు పెట్టుకొని ఆర్థికంగా వెసులుబాటు కల్పించుకొని



జీవనోపాధి కల్పించుకోవాలని అన్నారు.శిక్షణ అందిస్తున్న ఫ్యాకల్టీలు యువతులు ఏ వృత్తిలో అయితే శిక్షణ తీసుకుంటున్నారో ఆ శిక్షణతో పాటు బాహ్య ప్రపంచంలో కొత్త టెక్నిక్ సంబంధించిన విషయాలు వారికి తెలియజేయాలని, బ్యూటీషియన్ శిక్షణలో కొత్త సాంకేతికలు ఆధునిక పద్ధతులను చేర్చాలని అన్నారు.ప్రస్తుతం వివిధ కోర్సులలో శిక్షణ తీసుకుంటున్న యువతులు తోటి వారికి కూడా తెలియజేసి వారు కూడా వృత్తి నైపుణ్యాల శిక్షణ తీసుకొని జీవనోపాధి కల్పించుకునేలా చూడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీలు రోజా, క్రాంతి రేఖ, స్వరూప, సౌజన్య మరియు యువతులు తదితరులు పాల్గొన్నారు. అదనపు పౌర సంబంధాల అధికారి కార్యాలయము భద్రాచలం నుండి జారీ చేయడం అయినది

వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోటీల్లో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థి ప్రతిభ

జిల్లా స్థాయి ఉపన్యాస పోటీల్లో నవదీప్ రెడ్డికి ప్రథమ బహుమతి.

చర్చ :- అశ్వారావుపేట.వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2026-27లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఉపన్యాస పోటీల్లో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. తమ వాక్చాతుర్యంతో, స్పష్టమైన భావవ్యక్తీకరణతో పోటీల్లో పాల్గొని అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ పోటీల్లో కళాశాల ఆఖరి సంవత్సరం విద్యార్థి బి. నవదీప్ రెడ్డి ప్రథమ బహుమతి సాధించి కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె. హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆఖరి సంవత్సరం విద్యార్థులు బి. నవదీప్ రెడ్డి, ఎ. ప్రశాంత్‌తో పాటు రెండవ సంవత్సరం విద్యార్థులు షేక్ ఇర్ఫాన్, నిఖిల్ జిల్లా స్థాయి



ఉపన్యాస పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. సమకాలీన అంశాలపై అవగాహనతో పాటు విషయాన్ని స్పష్టంగా వివరించే నైపుణ్యం, ఆత్మవిశ్వాసంతో కూడిన ప్రసంగంతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారు.ఈ పోటీల్లో బి. నవదీప్ రెడ్డి ప్రథమ బహుమతి సాధించడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఈ విజయం కళాశాల విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం, ప్రజాస్వామ్య వ్యవస్థపై చర్చల్లో చురుకుగా పాల్గొనడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా కళాశాల వర్గాలు పేర్కొన్నాయి.విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె. హేమంత్ కుమార్, అధ్యాపక బృందం నవదీప్ రెడ్డితో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రశాంత్, షేక్ ఇర్ఫాన్, నిఖిల్‌లను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ నవదీప్ రెడ్డి ఇదే ప్రతిభను కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన అధ్యాపకులను కూడా అభినందించారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ, జయంతి వేడుకలు

నేటి చర్చ:- కోహెడ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలం.భారత రాజ్యాంగ నిర్మాత బీ ఆర్ అంబేద్కర్. చౌరస్తాలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 151 వ, జయంతి వేడుకలు ప్రముఖ సామాజిక కార్యకర్త, కంటస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో నిర్వహించగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సాయికృష్ణ హాస్పటల్ లోని రోగులకు పండ్లు, బ్రేడ్ పంపిణీ చేశారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ....
సర్దార్ వల్లభాయ్ దేశ ఐక్యత, సమగ్రత కోసం పటేల్ చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశ సమైక్యతకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.స్వతంత్ర భారతదేశానికి మొదటి ఉప ప్రధానిగా హోం మంత్రిగా బాధ్యతలు నిర్వహించాడని దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత భౌగోళికంగా భారతదేశం ముక్కలు కాకుండా ఒక్కటి చేసిన మహనీయుడని కీర్తించారు. మనకు స్వాతంత్రం వచ్చేనాటికి దేశంలో ఉన్న 565 కు పైగా స్వదేశీ సంస్థానాలను ఇండియన్ యూనియన్ లో విలీనం చేసి అఖండ భారత దేశానికి పునాదులు వేసిన మహనీయుడని ఉక్కుమనిషి ఇండియన్ బిస్మార్క్ గా ప్రసిద్ధి చెందాడని అన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉన్న మన తెలంగాణకు నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి కల్పించాడని, తెలంగాణలో ప్రజలు నిజాం పాలనలో బానిసల్లాగా బ్రతుకుతూ అనేక చిత్రహింసలకు గురయ్యారని స్త్రీల మానప్రాణాలకు రక్షణ లేని పరిస్థితులు ఉండేవని ఇలాంటి



రాక్షస, అరాచక పరిపాల నుండి 19 48 సెప్టెంబర్ 17న, మనకు విముక్తి కల్పించే స్వేచ్ఛ వాయువుల్ని పీల్చుకునే స్వాతంత్రాన్ని ప్రసాదించిన గొప్ప వ్యక్తిని ఇలాంటి స్వాతంత్రోద్యమ మహనీయుల యొక్క జయంతి కార్యక్రమాలను నిర్వహించడం మన బాధ్యతని అన్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా కేంద్ర ప్రభుత్వం స్టాచ్యూ ఆఫ్ యూనిటీ పేరుతో ప్రపంచంలోనే అతి ఎత్తైన ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని, పుట్టినరోజును జాతీయ ఐక్యత దినంగా జరుపుకుంటారని దేశం కోసం త్యాగాలు చేసిన ఇలాంటి నాయకుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు తాడేం బాలయ్య,డాక్టర్ ఎన్ శ్రీనివాస్,అంబేద్కర్ సంఘం నాయకులు బిట్ల దామోదర్,డ్యాగటి వెంకటయ్య,మైనారిటీ నాయకులు షేక్ జమాల్, హుస్సేన్,ఖమ్మం రాజమౌళి,నారాయణవ్యార్ లింగారెడ్డి,మల్లయ్య, భూమయ్య, రాజు,రాజస్థాన్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

● వ్యాసరచన పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేసిన ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్





భూపాలపల్లి, అక్టోబర్ 31

విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న అంశాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు, పోలీస్ అధికారులు, సిబ్బందికి నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, మహిళలు, బాలల భద్రత, రోడ్డు భద్రతపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి విక్రయాలు, సైబర్ నేరాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.పోలీస్ అమరవీరుల త్యాగాలను, ప్రజల రక్షణ కోసం పోలీసులు అందిస్తున్న సేవలను స్మరించుకునే సందర్భమే పోలీస్ ఫ్లాగ్ డే అని పేర్కొన్నారు. విజేతలు భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, వర్టికల్ డీఎస్పీ రెహమాన్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నివారణకు ‘కమ్యూనిటీ కనెక్ట్’

● తొలుత తొమ్మిది పోలీస్ స్టేషన్ల పరిధిలో అమలు

● వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత



వరంగల్, అక్టోబర్ 31

నేరాల నివారణలో ప్రజలను భాగస్వాములను చేసేందుకు ‘కమ్యూనిటీ కనెక్ట్’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ పోలీసులు నేరుగా ఇళ్ల వద్దకు వెళ్లి వివిధ నేరాలు, మోసాల నివారణపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, మహిళలు, చిన్నారుల భద్రత, ఆస్తి సంబంధిత నేరాలు, దృష్టి మరల్చి చేసే దొంగతనాలపై ప్రజలకు వివరించనున్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల దుష్ప్రభావాలతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను తెలియజేయనున్నారు. అపరిచితులకు బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించవద్దని కమిషనర్ సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.తొలుత వరంగల్ నగరంలోని తొమ్మిది పోలీస్ స్టేషన్ల పరిధిలో కార్యక్రమాన్ని అమలు చేసి, అనంతరం కమిషనరేట్‌లోని అన్ని పోలీస్ స్టేషన్లకు విస్తరిస్తామని తెలిపారు. పోలీసులకు, ప్రజలకు మధ్య సంబంధాలను బలోపేతం చేయడమే కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజల భాగస్వామ్యం, అప్రమత్తతతో నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

విద్యార్థుల భద్రతే షీ టీంల లక్ష్యం

● ఎస్సార్ డిజి హైస్కూల్లో షీ టీం, భరోసా అవగాహన కార్యక్రమం





భూపాలపల్లి, అక్టోబర్ 31

విద్యార్థుల భద్రత, బాలల హక్కుల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని షీ టీం ఎస్సై స్వప్న కుమారి తెలిపారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ఎస్సార్ డిజి హైస్కూల్లో షీ టీం, భరోసా సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా స్వప్న కుమారి మాట్లాడుతూ.. మహిళలు, బాలికలకు షీ టీం అందిస్తున్న రక్షణ సేవలను వివరించారు. గుడ్ టచ్--బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, బాలల హక్కులు, మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులకు ఓటీపీలు చెప్పవద్దని, అనుమానాస్పద లింకులను తెరవవద్దని సూచించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. అత్యవసర సమయంలో షీ టీం నంబర్ 8712658162, పోలీస్ అత్యవసర నంబర్ 112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098లను సంప్రదించాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, షీ టీం, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

సింగూర్ నుంచి మంజీరాకు 0.15 టీఎంసీల నీటి విడుదల

దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



సంగారెడ్డి, అక్టోబర్ 31 : తాగునీటి అవసరాల నిమిత్తం పుల్కల్ మండలంలోని సింగూర్ ప్రాజెక్టు నుంచి మంజీరా బ్యారేజ్‌కు 0.15 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత ప్రాజెక్టు గేట్ల ద్వారా నీటి విడుదల ప్రారంభమైందని పేర్కొన్నారు.మధ్యాహ్నం 1.55 గంటలకు ప్రాజెక్టులోని 4, 6, 7వ గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి, 11,310 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు. మొత్తం 0.15 టీఎంసీల నీటిని మంజీరా బ్యారేజ్‌కు విడుదల చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.నీటి విడుదల నేపథ్యంలో ప్రాజెక్టు దిగువ ప్రాంతాల్లో నివసించే ప్రజలు, రైతులు, మత్స్యకారులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. నదీ పరివాహక ప్రాంతంలోకి వెళ్లకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఇందిరాగాంధీ, సర్దార్ పటేల్‌కు ఘన నివాళులు

● కాశిబుగ్గ, కొత్తవాడ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య







వరంగల్, అక్టోబర్ 31

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 42వ వర్ధంతి, దేశ తొలి ఉప ప్రధాని, హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం కాశిబుగ్గ సెంటర్‌లో నివాళి కార్యక్రమం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ధూపం సంపత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందిరాగాంధీ విగ్రహానికి, సర్దార్ పటేల్ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి ఘన నివాళులర్పించారు. అనంతరం 23వ డివిజన్ కొత్తవాడలో మాజీ కార్పొరేటర్ దామెర సర్వేశం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సారయ్య పాల్గొన్నారు. అక్కడి ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమాల్లో పీసీసీ సభ్యుడు సల్లగొండ రమేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బసవరాజ్ కుమార్ స్వామి, మాజీ కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, బస్వరాజు శిరీష శ్రీమాన్, తత్తరి లక్ష్మణ్, దామెర సర్వేశం, జన్ను రవి, డీసీసీ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు, యూత్ కాంగ్రెస్ నాయకుడు వరుణ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు నారగోని మురళి గౌడ్, రామా యాదగిరి, కొమ్ముల సందీప్, మార్తా ఆంజనేయులు, వెల్దండి లక్ష్మణ్, జంజీరాల వేణు, రాముల బాబు, బైరబోయిన చంద్రమౌళి, కాశెట్టి వేణు, గుత్తికొండ తిరుపతి, బోలుగొడ్డు అనిల్, బత్తుల వినోద్, నరిగే శ్రీనివాస్, కూచన రవీందర్, సింగారపు చిరంజీవి, ఎస్‌కే ఇమ్రాన్, క్యాతం వేణు, వసుకుల ఉదయ్, ఈసంపల్లి ప్రభాకర్, సన్నీ పాల్గొన్నారు.

400 మీటర్ల పరుగులో హుస్నాబాద్ విద్యార్థికి ప్రథమ స్థానం

పరుగు పందెంలో మెరిసిన రిశ్వంత్



నేటి చర్చ:- హుస్నాబాద్:రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జి. రిశ్వంత్ ఎంపిక 400 మీటర్ల పరుగులో హుస్నాబాద్ విద్యార్థికి ప్రథమ స్థానం 70వ ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి పాఠశాలల అథ్లెటిక్స్ పోటీల్లో హుస్నాబాద్‌కు చెందిన విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. 17 ఏళ్ల బాలుర విభాగంలో 400 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సిద్దిపేట జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య (గా+ఖీ) ఆధ్వర్యంలో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల ఉమ్మడి స్థాయిలో 14, 17 ఏళ్ల బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలను సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ పోటీల్లో హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న జి. రిశ్వంత్ 400 మీటర్ల పరుగుపందెంలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు.

ఈ సందర్భంగా విజేత రిశ్వంత్‌ను సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి బంగారు పతకంతో సత్కరించి అభినందించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్ చెన్నూరి గంగాధర్, అధ్యాపకులు శ్రీనివాస్ రాజు, రజిని అభినందించారు. విద్యార్థి కృషిని హుస్నాబాద్ మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఆర్. శ్రీనివాస్ ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సర్రా భాస్కర్ రెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. వెంకటస్వామి, సీనియర్ పీడీలు సుజాత, రామేశ్వర్ రెడ్డి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వశ్రీ రెసిడెన్సీ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

● అధ్యక్షుడిగా విజయభాస్కరరెడ్డి.. ప్రధాన కార్యదర్శిగా కుమారస్వామి





అక్టోబర్ 31

విశ్వశ్రీ రెసిడెన్సీ ఓనర్స్ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మావురపు విజయ భాస్కరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రుద్రోజు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా రాచర్ల కుమారస్వామి, సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ అహ్మద్, కోశాధికారిగా శ్రీరామోజు విద్యాసాగర్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బి. లక్ష్మణ్, ఇంజనీర్ కంకల సదానందం, ఎం. నారాయణ, ఆడెపు నాగరాజు, ఎన్. దేవేందర్, కె. శ్రీనివాస్, కె. సత్యనారాయణ, వి. సాయికుమార్, కానోజ్ వెంకటాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. నవంబర్‌లో అపార్ట్‌మెంట్‌లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. యజమానులందరూ ప్రతి నెలా 10వ తేదీలోపు నిర్వహణ రుసుమును కోశాధికారికి చెల్లించాలని కోరారు. మిషన్ భగీరథ నీటి సరఫరా తక్కువగా ఉన్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించాలని నిర్ణయించారు.అపార్ట్‌మెంట్ అభివృద్ధికి యజమానులందరూ సహకరించాలని, సలహాలు, సూచనలు అందించాలని కోరారు. వాటిని పరిగణనలోకి తీసుకుని సమష్టిగా ముందుకు సాగుతామని తెలిపారు. గత కమిటీ అందించిన సేవలకు నూతన కమిటీ ధన్యవాదాలు తెలిపింది.

ఇందిరాగాంధీ 42వ ‘వర్ధంతి వేడుకలు



నేటి చర్చ :- హుస్నాబాద్:భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళగా పేరుగాంచిన ఇందిరా గాంధీ 42వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దేశ సమగ్రత, సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇందిరా గాంధీ చేసిన సేవలు, త్యాగాలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మి,వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ రవీందర్, కౌన్సిలర్లు పూదరి వరప్రసాద్, భూక్య సంపత్ నాయక్, కొండ రజిత, సావుల మంజుల, బత్తుల స్వరూప, కో ఆప్షన్ సభ్యులు ఎండి. హసన్, భూక్య సరోజన, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లావుడియా బిక్యా నాయక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రూ. 26 కోట్ల సైబర్ ఫ్రాడ్ కేసు.. హైదరాబాద్‌లో ఈడీ సోదాలు

హైదరాబాద్ :హైదరాబాద్‌లో మూడు ప్రాంతాల్లో ఈడీ సోదాలు అల్లంరాజు సత్యనారాయణమూర్తి ఆస్తులే లక్ష్యంగా దాడులు భారీగా నగదు, రూ. 5 కోట్ల విలువైన స్థిరాస్తులు గుర్తింపు

అధిక లాభాల ఆశ చూపి వెబ్‌సైట్ ద్వారా మోసం చేసినట్లు ఆరోపణలుసైబర్ మోసానికి సంబంధించిన భారీ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించింది. అల్లంరాజు సత్యనారాయణమూర్తికి చెందిన మూడు ప్రాంగణాల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కేరళలోని ఎర్నాకుళం సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్.ఐ.ఆర్ ఆధారంగా ఈడీ ఈ చర్యలు చేపట్టింది.కేసు వివరాల ప్రకారం.. నిమేష్ అనే వ్యక్తిని ఫోన్ కాల్స్, టెలిగ్రామ్ సందేశాల ద్వారా కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సంప్రదించి, అధిక లాభాల పేరుతో ప్రలోభపెట్టారు. ఫుజూఖ్‌శ్రీఅజ్.ఎశీఏ అనే వెబ్‌సైట్‌లో పెట్టుబడులు పెడితే భారీ రాబడి లభిస్తుందని నమ్మించారు. వారి మాటలను విశ్వసించిన బాధితుడు, 2023 మే నుండి 2024 మే మధ్య కాలంలో సుమారు రూ. 26.02 కోట్లను నిందితులు సూచించిన వివిధ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశాడు. అయితే,



పెట్టిన పెట్టుబడి గానీ, లాభాలు గానీ తిరిగి రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.ఈ కేసును మనీలాండరింగ్ కోణంలో విచారించిన ఈడీ, బాధితుల నుండి అక్రమంగా సేకరించిన నిధులను నిందితులు బినామీ ఖాతాలు, వివిధ కంపెనీలకు మళ్లించినట్లు గుర్తించింది. బీటీఆర్ ఇండస్ట్రీస్, వెలుగు ట్రేడింగ్ కంపెనీ, ఆశ్రిత మెగా సొల్యూషన్స్, ఆశ్రిత ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వంటి సంస్థల పేర్లతో లావాదేవీలు నిర్వహించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ అక్రమ నిధులతో హైదరాబాద్‌లో ఒక విల్లా ప్రాజెక్ట్‌ను కూడా ప్రారంభించినట్లు ఈడీ విచారణలో వెల్లడైంది.తాజాగా నిర్వహించిన సోదాల్లో అధికారులు కీలక పత్రాలను, డిజిటల్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును మనీలాండరింగ్ కోణంలో విచారించిన ఈడీ, బాధితుల నుండి అక్రమంగా సేకరించిన నిధులను నిందితులు బినామీ ఖాతాలు, వివిధ కంపెనీలకు మళ్లించినట్లు గుర్తించింది. బీటీఆర్ ఇండస్ట్రీస్, వెలుగు ట్రేడింగ్ కంపెనీ, ఆశ్రిత మెగా సొల్యూషన్స్, ఆశ్రిత ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వంటి సంస్థల పేర్లతో లావాదేవీలు నిర్వహించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ అక్రమ నిధులతో హైదరాబాద్‌లో రూ. 6.40 లక్షల నగదును సీజ్ చేయడంతో పాటు, 11 బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 14 లక్షల నగదును స్తంభింపజేశారు. వీటితో పాటు దాదాపు రూ. 5 కోట్ల విలువైన ప్లాట్లు, విల్లా వంటి స్థిరాస్తులను గుర్తించినట్లు ఈడీ తన అధికారిక ప్రకటనలో పేర్కొంది.

జీఎస్ఎల్వీ-ఎఫ్18 ప్రయోగం విజయవంతం.. ఇస్రోకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు



హైదరాబాద్, అక్టోబర్ 31: శుక్రవారం అర్ధరాత్రి 11.51 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని షార్ (శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్) నుంచి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. దీని ద్వారా అత్యాధునిక నావిగేషన్ ఉపగ్రహం ఎన్‌విఎస్-03 ని నింగిలోకి పంపింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్రోను ప్రశంసిస్తూ.. శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బందికి అభినందనలు తెలిపారు.అత్యాధునిక నావిగేషన్ ఉపగ్రహం ఎన్‌విఎస్-03 ద్వారా భారత నావిగేషన్ సామర్థ్యాలకు మరింత బలం చేకూరుతుందని ముఖ్యమంత్రి రేవంత్ పేర్కొన్నారు. రవాణా, విమానయానం, సముద్ర నావిగేషన్ రంగాలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. పర్యవేక్షణ, అత్యవసర సేవల్లోనూ కీలకంగా మారనుందని తెలిపారు. ఇస్రో విజయం యావత్ దేశానికి గర్వకారణమన్న సీఎం.. భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

కండరాల క్షీణతతో బాధపడే చిన్నారులకు అండగా ఉంటాం

హైదరాబాద్, అక్టోబరు 31 : కండరాల క్షీణత, బలహీనత (మస్క్యులర్ డిస్ట్రోఫీ)తో బాధపడే చిన్నారులకు అండగా ఉంటామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ భరోసా కల్పించారు. మస్క్యులర్ డిస్ట్రోఫీని జెనెటిక్ టెస్టుల ద్వారానే అరికట్టగలమని వ్యాఖ్యానించారు. కండరాల క్షీణత వ్యాధిపైన దేశవ్యాప్తంగా విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. (శనివారం) హైదరాబాద్‌లో మీడియాతో సీపీ సజ్జనార్ మాట్లాడారు. చాలా ప్రాంతాల్లో కండరాల క్షీణతతో బాధపడుతున్న చిన్నారులను తాను చూశానని తెలిపారు. బాధిత పిల్లలకు భరత్ ఎండీ ఫౌండేషన్ అండగా నిలుస్తోందని వెల్లడించారు. ఈ సందర్భంగా భరత్ ఎండీ ఫౌండేషన్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు.ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత ఉండాలి..మనలో ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. కండరాల క్షీణత అనేది చాలా తీవ్రమైన వ్యాధి అని చెప్పుకొచ్చారు. ఈ రోజుల్లో చాలామంది పిల్లలను కన్న తర్వాత చెత్తకుప్పల్లో పడేస్తున్నారని.. కానీ పిల్లలకు తీవ్రమైన వ్యాధి ఉన్నప్పటికీ, వాళ్లను అపురూపంగా చూసుకుంటున్నారని... అలాంటి తల్లిదండ్రులు చాలా గ్రేట్ అని అభినందించారు. ఈ వ్యాధి ఉన్న చిన్నారుల సింగిల్ పేరెంట్స్‌ను కూడా తాను చాలామందిని చూశానని అన్నారు. అలాంటి తల్లిదండ్రులకు తగిన గుర్తింపు ఇవ్వాలని సూచించారు.



జీహెచ్ఎంసీ తీరుపై హైకోర్టు ఆగ్రహం.. కూల్చివేతలపై ప్రశ్నల వర్షం

హైదరాబాద్: నిర్మాణాలపై జీహెచ్ఎంసీ వైఖరిపై హైకోర్టు ఆగ్రహం అనుమతులిచ్చి, క్రమబద్ధీకరించి మీరే కూల్చేస్తారా? అని ప్రశ్న మల్కాజ్‌గిరి డిఫెన్స్ హౌసింగ్ సొసైటీ కేసులో తీవ్ర వ్యాఖ్యలు కౌంటర్లు దాఖలు చేసేందుకు జీహెచ్ఎంసీ, హైడ్రాకు తుది గడువు 'నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించడం మీరే చేసి, ఇప్పుడు మళ్లీ వాటిని కూల్చివేయమని అడగడమేంటి?' అంటూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. భవన నిర్మాణ అనుమతులు, కూల్చివేతల విషయంలో జీహెచ్ఎంసీ వైరుధ్యపూరిత వైఖరిని కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది.మల్కాజిగిరి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న డిఫెన్స్ హౌసింగ్ కోఆపరేటివ్



సొసైటీకి సంబంధించిన వివాదంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సొసైటీ పరిధిలోని ప్లాట్లలో హైడ్రా చేపట్టిన కూల్చివేతలను సవాల్ చేస్తూ నర్సింహారెడ్డి తదితరులు పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు, సొసైటీకి చెందిన 6,039 చదరపు గజాల స్థలంలో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డ్ నిర్మించి, వాహనాలు పార్క్ చేస్తోందని సొసైటీ మరో పిటిషన్ వేసింది.జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్ ఈ కేసును విచారించారు. తమ వద్ద అన్ని అనుమతులు ఉన్నాయని, లేఅవుట్ కూడా క్రమబద్ధీకరించారని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి, లేఅవుట్లను క్రమబద్ధీకరించిన తర్వాత, అందులోని ప్రజా వినియోగ స్థలాలను కాపాడాలని రెవెన్యూ, హైడ్రా శాఖలకు జీహెచ్ఎంసీ లేఖలు రాయడమేమిటని ప్రశ్నించారు. తమ సొంత స్థలంలోని నిర్మాణాలను తొలగించుకోకుండా, రెవెన్యూ శాఖను ఆశ్రయించాల్సిన అవసరం ఏమొచ్చిందని జీహెచ్ఎంసీని నిలదీశారు.ఈ నేపథ్యంలో, కౌంటర్లు దాఖలు చేసేందుకు జీహెచ్ఎంసీ, హైడ్రాలకు చివరి అవకాశంగా మూడు వారాల గడువు ఇస్తూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.

తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా మోడల్ పాఠశాలలు - రూ.787 కోట్లతో విద్యాశాఖ ప్రణాళిక

హైదరాబాద్ :తెలంగాణ రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లను సమూలంగా మార్చేందుకు విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. అన్ని మోడల్ స్కూళ్లను తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు (టీపీఎస్?) గా మార్చే లక్ష్యంతో విద్యాశాఖ రూ.787 కోట్ల వ్యయంతో ప్రణాళికను రూపొందించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. దీనికి ఆమోదం లభిస్తే, వచ్చే విద్యా సంవత్సరం 2027-28 నుంచి ఈ మార్పులు అమల్లోకి వస్తాయి. ప్రస్తుతం ఈ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు ఉన్నాయి. కొత్త ప్రణాళిక ప్రకారం 1 నుంచి 5వ తరగతులను కూడా చేర్చనున్నారు.ప్రాథమిక తరగతుల కోసం రూ.582 కోట్లురాష్ట్రంలో 2012-13 విద్యా సంవత్సరంలో 194 మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేశారు. ప్రాథమిక తరగతులను ప్రవేశపెట్టేందుకు ప్రతి పాఠశాలలో అదనంగా ప్రతి తరగతికి రెండు చొప్పున తరగతులు అవసరమవుతాయి. ఒక్కో పాఠశాలకు



రూ.3 కోట్ల చొప్పున, మొత్తం రూ.582 కోట్లు ఖర్చవుతాయని విద్యాశాఖ అం చనా వేసింది. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం 'ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్' (ఏఐబీబీ) నుంచి విద్యాశాఖ కోసం తీసుకోనున్న రుణంలో కొంత భాగాన్ని ఉపయోగించాలని ప్రతిపాదించారు.అసంపూర్తి పనుల కోసం రూ.205 కోట్లు105 మోడల్ స్కూళ్లలో భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని లేదా ఇతర మరమ్మతులు అవసరమని విద్యాశాఖ గుర్తించింది. 38 చోట్ల నిర్మాణాలు పాక్షికంగా మాత్రమే పూర్తయ్యాయి. మరో 67 చోట్ల నిర్మాణాలు ఇంకా ప్రారంభం కావాల్సి ఉంది. వీటితోపాటు కాంపౌండ్ వాల్‌ల నిర్మాణం, పాఠశాల ప్రాంగణాల అభివృద్ధి, క్రీడా మైదానాల ఏర్పాటు, బాస్కెట్‌బాల్ కోర్టుల నిర్మాణం వంటి వివిధ పనుల కోసం సుమారు రూ.205.54 కోట్లు అవసరమవుతాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ మొత్తం రూ.787.54 కోట్ల కోసం ప్రతిపాదనలను సమర్పించింది. ఇందులో ఏఐబీబీ రుణం నుంచి 70 శాతంకాగా, 30 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది.చేసింది.ప్రతి పాఠశాల వద్ద అదనంగా 300 సీట్లుప్రస్తుతం ఒక్కో పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 820 చొప్పున మొత్తం 1,59,000 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో సుమారు 1,10,000 సీట్లు భర్తీ అయ్యాయి. దీనివల్ల మొత్తం 194 పాఠశాలల్లో 58,200 సీట్లు అదనంగా అందుబాటులోకి వస్తాయి. మోడల్ స్కూల్స్‌లో ఉపాధ్యాయులు పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలోనే బోధించడం ఒక ప్రత్యేకత. ఈ మార్పుల వల్ల ప్రాథమిక స్థాయి తరగతులకు మంచి స్పందన లభిస్తుందని అధికారులు ఆశిస్తున్నారు.

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు విరాళాలు.. డీజీపీకి చెక్కుల అందజేత

హైదరాబాద్, అక్టోబరు 31 : యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.42.5 లక్షల సీఎస్ఆర్ నిధులు జమ అయ్యాయి. ఈ స్కూల్‌కు మూడు కార్పొరేట్ సంస్థల నుంచి రూ.42.5 లక్షల విరాళం అందాయి. కోహినూర్ గ్రూప్‌నకు చెందిన రూ.25 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌కు సంస్థ ప్రతినిధులు చెక్కును ఇచ్చారు.పుజోలానా మెషినరీ ఫ్యాబ్రికేషన్స్ ఎండీ ఆదిత్య పాయ్, ఆర్యన్ ప్రెసిషన్ సంస్థ తరపున రూ.10 లక్షల విరాళం అందజేశారు. దివ్యశక్తి గ్రూప్ వ్యవస్థాపక డైరెక్టర్ రవీంద్ర కుమార్ అగర్వాల్ రూ.7.5 లక్షలు ఇచ్చారు. విద్యాభివృద్ధికి ముందుకొచ్చిన సంస్థల ప్రతినిధులను డీజీపీ ఆనంద్



అభినందించారు. పోలీసు సిబ్బంది పిల్లల విద్యాభివృద్ధికి ఈ నిధులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. సమాజానికి పోలీసు సిబ్బంది అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఆయా సంస్థలు సహకారం అందిస్తున్నాయని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు

ప్రైవేట్ ఆసుపత్రులకు లబ్ధి చేకూరుస్తున్న ఎమ్మెల్యే



మహబూబ్‌నగర్, అక్టోబర్ 31: ఇప్పటికైనా జడ్చర్ల ప్రభుత్వాసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సి. లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జడ్చర్లలో అంబేద్కర్ కళా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రి బాగా లేదంటూ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తద్వారా ప్రైవేట్ ఆస్పత్రులకు లబ్ధి చేకూరుస్తున్నారని ఎమ్మెల్యే వైఖరిని ఎండగట్టారు.వైద్యులు, సిబ్బంది ఉంటే ఆసుపత్రికి పేషంట్స్ వస్తారా? లేక పేషంట్స్ వస్తే వైద్యులు వస్తారా? అని ఎమ్మెల్యేను ఆయన ప్రశ్నించారు. జడ్చర్ల, మిడ్జిల్ మండలాల పరిధిలోని 50 గ్రామాల ప్రజలు ఈ ఆసుపత్రికి వస్తారని వివరించారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిది బాధ్యతారాహిత్యం అని విమర్శించారు.జడ్చర్ల నియోజకవర్గంలో సమస్యల పరిష్కారాన్ని వదిలేసి ఎటువంటి రాజకీయాలు నడుస్తున్నాయో చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు. హుందాగా రాజకీయాలు చేయాలని చాలా సార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేకు చెప్పానని తెలిపారు. ఎమ్మెల్యే సంస్కారం ఏమిటనేది ప్రజలంతా చూస్తున్నారని అన్నారు.జడ్చర్లకు మూడేళ్ల కిందట నీళ్లు వస్తే ఇప్పటికీ అదే వీడియో పెట్టి చూపిస్తున్నారంటూ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యవహారశైలిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఎప్పుడూ నీళ్లు రాలేదని చెప్పారు. నీ స్వగ్రామంలోని అపైర్డ్‌ల్యాండ్‌ను డబుల్ బెడ్ రూం ఇళ్లకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేటాయించామని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి గుర్తు చేశారు.

భర్త చనిపోతే భార్యకు పింఛను - దివ్యాంగ, గీత, డయాలసిస్ మొదలైన బాధితులకు భారీ ఊరట!

హైదరాబాద్ :తెలంగాణ ప్రభుత్వం ఆసరా పింఛన్ల బదిలీ ప్రక్రియలో ఒక చారిత్రాత్మక మార్పును తీసుకొచ్చింది. పింఛను పొందుతున్న వ్యక్తి మరణిస్తే, ఆ పింఛనును వారి జీవిత భాగస్వామి పేరుకు మార్చే ప్రక్రియను సులభతరం చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో పింఛను పొందుతున్న భర్త మరణిస్తే ఆయన భార్యకు వితంతు పింఛను రావడానికి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. కార్యాలయాల చుట్టూ తిరగడం, అధికారుల పరిశీలన వంటి కారణాల వల్ల నెలల సమయం పట్టేది.ఇక నుంచి ఆ సమస్య లేకుండా ఆదేశాలు జారీచేసింది. ఇప్పటివరకు వృద్ధాప్య పింఛను పొందుతున్న భర్త మరణించిన సందర్భంలో అతని భార్యకు మాత్రమే పింఛను మంజూరు పొందే నిబంధన ఉండేది. దీనిని దివ్యాంగులు, గీత, చేనేత



కార్మికులు, డయాలసిస్, హెచ్ఐవీ, ఫైలేరియా పింఛనుదారులకు కూడా విస్తరించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీని ప్రకారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.దివ్యాంగ, గీత, చేనేత, ఇతర వర్గాలలో పింఛను పొందుతూ తమ భర్తలను కోల్పోయిన మహిళలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వారికి మద్దతుగా తక్షణ పింఛను సహాయం అందించాలని కోరుతూ సెర్ప్? సీఈఓ దివ్యా దేవరాజన్ ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వీటిని తక్షణమే ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.భర్త మృతి చెందిన తర్వాత భార్యకు పింఛనుదివ్యాంగ, గీత, చేనేత కార్మికులు, డయాలసిస్, హెచ్ఐవీ, ఫైలేరియా వర్గాల కింద మరణించిన పింఛనుదారుడి భార్య వయస్సు 57 సంవత్సరాల కంటే తక్కువగా ఉంటే, వితంతు పింఛను ఇవ్వడం జరుగుతుంది. ఆమెకు 57 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉంటే వృద్ధాప్య పింఛను మంజూరు చేస్తారు.ద్ద, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ, మరణించిన పింఛనుదారుని ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు సమర్పించాలి. సంబంధిత అధికారులు పత్రాలను పరిశీలిస్తారు. చేయూత పోర్టల్‌లో వివరాలను నమోదు చేసి, అర్హతను నిర్ధరిస్తారు. ఆ తర్వాత పింఛను మంజూరు చేస్తారు.

2,382 మేయర్, ఛైర్‌పర్సన్, కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు.

అమరావతి :రాష్ట్రంలో 92 చోట్లే రేపు పుర పోరు సాగనుంది. మిగిలిన ఎనిమిది చోట్లా ఛైర్‌పర్సన్ సహా కౌన్సిలర్ల స్థానాలు ఏకగ్రీవమ య్యాయి. 2,382 మేయర్, ఛైర్‌పర్సన్, కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. 6,669 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. రాష్ట్రంలో 8 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఛైర్‌పర్సన్ సహా వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవం కావడంతో 92 పట్టణ స్థానిక సంస్థలకే పోలింగ్ నిర్వహించనున్నారు. వీటిలో 13 నగరపాలక సంస్థలు, 79 పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మొత్తం 2,382 స్థానాలకు 11 వేల 705 పోలింగ్ కేంద్రాల్లో 99 లక్షల 36 వేల 14 మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 100 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం మొదట నోటిఫికేషన్ ఇచ్చింది. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణలు, ఏకగ్రీవాల తరువాత 92 పురపాలికల్లో 6,669



మంది బరిలో నిలిచారు. కార్పొరేషన్, మున్సిపల్ కార్యాలయాల నుంచి శనివారం ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలించనున్నారు.13 మేయర్ స్థానాలకు 153 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. 922 డివిజన్ స్థానాల్లో 118 ఏకగ్రీవం కాగా 804 స్థానాలకు పోలింగ్ నిర్వహిస్తున్నారు. 3 వేల 73 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కార్పొరేషన్ ఎన్నికల కోసం 6,384 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 59 లక్షల 97 వేల 918 ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.అక్కడ నో పోలింగ్?: రాష్ట్రంలో 87 ఛైర్‌పర్సన్ స్థానాలు ఉండగా 17 ఏకగ్రీవమయ్యాయి. 70 స్థానాలకు పోలింగ్ నిర్వహిస్తుండగా 367 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 3 వేల 20 వార్డు స్థానాల్లో 637 ఏకగ్రీవమయ్యాయి. 2382 స్థానాలకు పోలింగ్ నిర్వహిస్తుండగా 6669 అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల కోసం 5,321 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు ార్పొరేషన్ కార్పొరేషన్ ఎన్నికల కోసం 6,384 పోలింగ్ ఎన్నికల కోసం 6,384 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 59 లక్షల చేశారు. 39 లక్షల 38వేల 96 ఓటర్లు ఓటు హక్కు వినియోగి ంచుకోనున్నారు. పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల, దర్శి, ప్రొద్దుటూరు, కమ లాపురం, రాయచోటి, ఆళ్లగడ్డలో పాలకవర్గ మంతా ఏకగ్రీవమయ్యాయి. ఆత్మకూరు మున్సి పాల్టీలోని 20వ వార్డులో నామినేషన్లు వేసిన వారంతా ఉపసంహ రించుకున్నారు. దీంతో అక్కడ ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించడం లేదు.

విద్యార్థినులపై దాడి చేసిన వ్యక్తిని వదిలిపెట్టం.. పరిటాల సునీత హెచ్చరిక

అనంతపురం, అక్టోబర్ 31:



జిల్లాలో విద్యార్థినులపై జరిగిన దాడి ఘటనపై ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్ర ంగా స్పంది ంచారు. ఉన్మాది దాడిలో గాయపడిన విద్యార్థి నులను ఆమె ఆసుప త్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యుల కు సూచించారు. దాడిలో గాయపడిన విద్యార్థి నుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండటంతో వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. విద్యార్థినులపై దాడి చేసిన వ్యక్తిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా తీవ్రంగా స్పందించారని పరిటాల సునీత తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను సీఎం ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారని.. బాధిత విద్యార్థినులకు అండగా ఉండాలని ఆదేశించారని వెల్లడించారు. విద్యార్థినులపై దాడికి పాల్పడి ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారని తెలిపారు. నిందితుడిని త్వరలోనే పట్టుకుని చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యా ర్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పరిటాల సునీత స్పష్టం చేశారు.

అక్రమాలు నిరూపిస్తే రాజీనామా చేస్తా.. జగన్‌కు మంత్రి సత్యకుమార్ ఛాలెంజ్



అమరావతి, అక్టోబర్ 31: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజకీయాల్లో జగన్ ఓ శకుని అని... తెరవెనుక శిఖండిలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. మున్సిపల్ ఎన్నికల్లో తనపై అక్రమాలు నిరూపిస్తే మంత్రి పదవికి రాజీ నామా చేస్తా అంటూ సవాల్ విసిరారు.మరో 24 గంటల్లో వైసీపీ భూస్థాపితం ఖాయమని.. కూటమికి ప్రజలు బ్రహ్మరథం పడతారని ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే వాస్తవా లను వక్రీకరించి సొంత మీడియాతో తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు మేనమామగా కనీస బాధ్యత నెరవేర్చలేని జగన్.. ఇతరులకు నీతులు చెబుతారా అంటూ మంత్రి ధ్వజమెత్తారు. సొంత తల్లి, చెల్లికి అన్యాయం చేసిన వ్యక్తికి విమర్శించే నైతిక హక్కు ఎక్కడుందని అన్నారు. వైశ్యులను రాజకీయ పావులుగా వాడుకోవడం వైసీపీ రాజకీయ రాక్షస క్రీడకు నిదర్శనమంటూ ఫైర్ అయ్యారు. చేనేత కార్మికులపై దాడులు చేసిన వైసీపీ నేతలు.. ఇప్పుడు కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. పచ్చి ఆర్థిక నేరగాడు జగన్ అని. ప్రత్యర్థులు డబ్బులు ఖర్చుపెడుతున్నారని ఆరోపించడం విడ్డూం మన్నారు. వైసీపీ హయాంలో దళిత డాక్టర్ సుధాకర్ ఘటన, డోర్ డెలివరీ హత్యలను రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. ?అనవసర వివాదాలు మానుకుని.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు ఏం చేశారో సమాధానం చెప్పాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ డిమాండ్ చేశారు.

రాష్ట్రానికి చేరుకున్న కేంద్ర బృందం - తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

అమరావతి :అర్నబ్ తుపాను నష్టంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసేందుకు ఏడుగురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం రాష్ట్రానికి చేరుకుంది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని బృందం నేటి నుంచి తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనుంది. కోనసీమ, కాకినాడ, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పంటలు, రహదారులు, విద్యుత్, ఇతర మౌలిక వసతులకు జరిగిన నష్టాన్ని పరిశీలించనుంది.రాష్ట్రానికి చేరుకున్న కేంద్ర బృందానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆర్టీజీఎస్?కు చేరుకున్న బృందానికి ఆర్టీజీ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అర్నబ్ తుపాను కారణంగా జరిగిన నష్టంపై వివరించారు. తుపాను తీవ్రత, వివిధ ప్రాంతాల్లో జరిగిన నష్టం, ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన సహాయక చర్యలపై కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం రెండు బృందాలుగా విడిపోయి క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. ఒక బృందానికి ప్రఖర్ జైన్, మరో బృందానికి సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధరబాబు నేతృత్వం వహించనున్నారు. పర్యటన అనంతరం కేంద్రానికి నివేదిక సమర్పించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోనూ కేంద్ర బృందం సమావేశమయ్యే అవకాశముంది.కరవుపై పరిశీలనకు మరో కేంద్ర బృందం : మరోవైపు రాష్ట్రంలో కరవుపై పరిశీలనకు మరో కేంద్ర బృందం పర్యటించనుంది. ఖరీఫ్?లో కరవు పరిస్థితుల అధ్యయనానికి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ చిన్మయ్ గోట్మారే నేతృత్వంలోని బృందం



సోమ, మంగళవారాల్లో కరవు ప్రభావిత జిల్లాలైన శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటన చేయనున్నారు. 10 మంది సభ్యులు రెండు బృందాలుగా క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి కరువు పరిస్థితి విశ్లేషణ చేయనున్నారు. ఖరీఫ్-2026 లో 283 మండలాల్లో తీవ్ర కరవు, 105 మధ్యస్థ కరవు మండలాలుగా ఇప్పటికే ప్రకటించారు. బుధవారం ఈ బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యే అవకాశం ఉందినవంబరు 2న ఉదయం 10.30గంటల నుంచి 12 గంటల మధ్య కరవు బృందం సభ్యులు అనంతపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌తో సమావేశమవుతారు. మధ్యాహ్నం 12.30కు ఆత్మకూరు మండలం పంపనూరులో పొలాలను పరిశీలించి, రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం దెబ్బతిన్న కంది, పెసర ఆముదం వంటి పంట లతో పాటు రైతు సేవ కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తారు. 1.15కు ఆత్మకూరు ప్రాథమిక సహకార సొసైటీకి చేరుకొని పశుసంవద, గడ్డి లభ్యతపై తెలుసుకుంటారు. 3.15కు కళ్యాణదుర్గం మండలంలో భూగర్భ జలాలు, పాల డెయిరీ పరిస్థితులను అడిగి తెలుసుకుంటారు. 4.00కు కళ్యాణదుర్గం మండలం ములకనూరులో కంది, టమాటా రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు అనంతపురం చేరుకొని బస చేస్తారు.3వ తేదీ ఉదయం 9.30-10 గంటల వరకు బత్తలపల్లిలో ఆముదం రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. 10.25కు గుమ్మలకుంటలో ఎండిపోయిన చీనీ తోటను రైతులతో కలిసి పరిశీలిస్తారు. 10.45కు దంపెట్ల రైతులతో ముఖాముఖి, ఉలవల పంట పొలాన్ని చూస్తారు. 11.40కు రామానుజులపల్లిలో రైతులతో ముఖాముఖి, పొలాలు, ఎంఐ ట్యాంకును పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12.10కు ముదిగుబ్బకు చేరుకొని రైతులతో ముఖాముఖి, వేరుసెనగ, కంది పంట పొలాలను పరిశీలిస్తారు. అతర్వాత రోడ్డు మార్గాన విజయవాడకు బయలుదేరి వెళ్తారు.

పుంగనూరు అరాచకాల కేసు - వైఎస్సార్సీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా అన్నమయ్య జిల్లా పుంగనూరులో అరాచకాలకు తెగబడిన కేసుల్లో నిందితుడు, వైఎస్సార్సీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అరెస్టు నుంచి రక్షణ కల్పించే విషయంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులు, ఫిర్యాదుదారులను ఆదేశిస్తూ విచారణను డిసెంబరు 28కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు.నామినేషన్లు వేసేందుకు వెళుతున్న టీడీపీ శ్రేణులపై దాడులకు తెగబడటం, ఆ పార్టీకి కార్యకర్తలపైకి వాహనాన్ని ప్రైవేటు బౌన్సర్‌తో నడిపించడం, హత్యాయత్నానికి ప్రయత్నించడం తదితర నేర ఘటనలపై అందిన ఫిర్యాదు ఆధారంగా ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులపై ఈ నెల 16న పుంగనూరు పట్టణ పోలీసులు 4 కేసులు నమోదు చేశారు.



తనపై నమోదు చేసిన 4 కేసులను కొట్టేయాలని వైఎస్సార్సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఆయన తరపున సీనియర్ న్యాయవాది ఒ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపించారు. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.ఈ ఘటనల్లో 30 మంది గాయపడ్డారని వాదన: పోలీసుల తరఫున పీపీ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. మిథున్‌రెడ్డికి సంబంధించిన ప్రైవేటు బౌన్సర్ ప్రజలపైకి కారును ఉద్దేశపూర్వకంగా నడిపి హత్య చేయడానికి యత్నించారన్నారు. వాహనాల్లో కర్రలు, రాడ్లు తీసుకొచ్చి దాడులకు తెగబడ్డారని తెలిపారు. పుంగనూరు తన అడ్డా అన్నట్లు పిటిషనర్ వ్యవహరించారని వాదనలు వినిపించారు. నామినేషన్ కేంద్రం వద్ద శాంతిభద్రతల సమస్యను సృష్టించారని తెలిపారు. ఈ ఘటనల్లో 30 మంది గాయపడ్డారని అన్నారు. వేరే మార్గాన్ని అనుసరించాలి తప్ప, క్వాష్ పిటిషన్లలో మధ్యంతర ఉత్తర్వులు పొందడానికి వీల్లేదన్నారు. అరెస్టు నుంచి రక్షణ పొందేందుకు పిటిషనర్ అనర్హుడని వారు వాదించారు.

విజయవాడలో ఎన్నికల సామాగ్రి పంపిణీ.. పోలింగ్‌కు సర్వం సిద్ధం



విజయవాడ, అక్టోబర్ 31: ఏపీలో మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. నగరంలోని లయోలా కళాశాల ప్రాంగణంలో విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియ మొదలైంది. 85 డివిజన్ల కార్పొరేటర్లు, మేయర్ ఎన్నికకు సంబంధించి పోలింగ్‌కు ఏర్పాట్లు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయవాడ నగరంలో ఒక డివిజన్ ఇప్పటికే ఏకగ్రీవం అయ్యిం దన్నారు.85 డివిజన్లకు (ఆదివారం) ఎన్నికలు జరగబోతున్నాయని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని చెప్పారు. నగరంలో మొత్తం 848 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో పోలీసు సిబ్బందితో కలిపి సుమారు 10 వేల మంది అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారన్నారు. నగరంలో 150 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేసేలా ఏర్పాట్లు చేశామని మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్ర పేర్కొన్నారు.

ఏబీ వెంకటేశ్వరరావుపై వ్యక్తిగత విమర్శలు చేయను



విజయవాడ : విజయవాడ నగర అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణే తన ప్రధాన లక్ష్యాలని కూటమి మేయర్ అభ్యర్థి వంగవీటి రాధా స్పష్టం చేశారు. నగరం లో ఏ ఒక్క కుటుంబం కూడా ఇబ్బంది పడకుండా ప్రశాంత వాతావరణం కల్పిస్తామన్నారు. రాజకీయ ప్రత్యర్థి అయిన ఏబీ వెంకటేశ్వరరావు అనుభ వాన్ని గౌరవిస్తానని, నగరాభివృద్ధికి ఆయన ఇచ్చే మంచి సూచనలు తప్పక స్వీకరిస్తానని తెలిపారు. నెరవేర్చలేని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయబోనని, విశ్వసనీయతకే కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు.మరోవైపు, ఏబీ వెంకటేశ్వరరావు కూడా రాధాతో తనకు 20 ఏళ్ల పరిచయం ఉందని, ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేయబోనని ప్రకటించారు. తమ మధ్య పోటీ రాజకీయపరమైనదే కానీ, వ్యక్తిగతం కాదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య జరిగిన ఆత్మీయ పలకరింపు.. ఎన్నికల వాతావరణంలో హుందాతనాన్ని నింపింది. నవంబర్ 1న మేయర్ ఎన్నికకు పోలింగ్ జరగనుండగా, ఫలితంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రాప్తాడులో ఉన్మాది రాక్షసత్వం - పదో తరగతి విద్యార్థినిపై రంపంతో దాడి

అనంతపురం జిల్లా: రాప్తాడులో ఉన్మాది రెచ్చిపోయాడు. చెట్లు నరికే రంపం మిషన్‌తో విద్యార్థినిపై విరుచుకుపడ్డాడు. తరగతి గదిలోకి వెళ్లి విచక్షణ రహితంగా దాడి చేశాడు. ఈ దారుణ ఘటనతో పాఠశాల ప్రాంగణం అంతా విద్యార్థుల హాహాకారాలతో భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ దారుణ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు లోకేశ్, అనిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడు పారిపోతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు రాప్తాడు ప్రభుత్వ పాఠశాలకు వెళ్లిన ఫోరెన్సిక్ బృందం తరగతి గదిని పరిశీలించింది.రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దారుణం జరిగింది. పదో తరగతి చదువుతున్న విద్యార్థిపై ఉన్మాది దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. చెట్లు నరికే రంపం మెషిన్‌తో తరగతి గదిలోకి ప్రవేశించి ఉన్మాదిలా ఊగిపోయిడు. విద్యార్థిని ముఖం, ఒంటిపై ఎక్కడికక్కడ నరికాడు. ఆ దాడితో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని ప్రాణా పాయస్థితిలోకి వెళ్లింది. అడ్డుకోబోయిన మరో



విద్యార్థిని కాళ్లు, చేతులకు గాయాలయ్యా యి. రక్తపు మడుగులో పడిఉన్న ఇద్దరినీ స్థానికులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థినికి ఎమర్జెన్సీ వార్డు ఆపరేషన్ థియే టర్‌లో శస్త్రచికిత్స జరుగుతోంది.ఉన్మాది సృష్టిం చిన విధ్వంసానికి తరగతి గది మొత్తం రక్తంతో తడిచిపోయింది. విద్యార్థుల పుస్తకాలు, బ్యాగు లు ఎక్కడికక్కడ చెల్లాచెదురయ్యాయి. తరగతి గదిలో ఎటు చూసినా భయానక పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థుల హాహాకారాలతో స్కూల్ మొత్తం భీతిల్లింది. ఉన్మాది ఘాతుకంతో మిగితా విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆం దోళనకు గురయ్యారు. పాఠశాల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. మరో వైపు అనం తపురం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బాధితుల తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి. మరోవైపు దాడి జరిగిన తరగతి గదిని ఫోరెన్సిక్ బృందం పరిశీలించింది. ఘటనాస్థలిలో దాడికి ఉపయోగించిన రంపం మెషీన్‌ను స్వాధీనం చేసుకుంది.పోలీసుల అదుపులో నిందితుడు: రాప్తాడు ఘటనలో ఉన్మాదిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఘటన అనంతరం నిందితుడు ధర్మవరం వైపు వెళు ్లండగా పట్టుకున్నట్లు సమాచారం. దుండగుడిని ధర్మవరం మండలానికి చెందిన యువకుడిగా గుర్తించారు. బాలికకు సమీప బంధువే దాడికి పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు.

ఉన్మాదిపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఉన్మాది దాడి ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల తరగతి గదిలో రంపంతో అత్యంత అనుమానుషంగా దాడి చేయడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తీవ్ర గాయాల పాలైన విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న చికిత్స గురించి సీఎం అధికారులతో మాట్లాడారు. నిందితుడిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.రాప్తాడు ఘటన బాధితురాలి తల్లితో సీఎం చంద్రబాబు ఫోనులో మాట్లాడారు. బాధిత విద్యార్థిని తల్లితో ఫోనులో మాట్లాడి సీఎం చంద్రబాబు ధైర్యం చెప్పారు. ధైర్యంగా ఉండాలని, నిందితుడిని పట్టుకుని కఠినంగా శిక్షిస్తామన్నారు. ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని బాలిక తల్లికి భరోసా ఇచ్చారు. విద్యార్థినికి అందుతున్న వైద్యంపై ఎమ్మెల్యే పరిటాల సునీతతో సీఎం మాట్లాడి, అడిగి తెలుసుకున్నారు. ఉన్మాది దాడిలో గాయపడిన మరో విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై సీఎం ఆరా తీశారు. ఇద్దరికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

ఇస్రో ఖాతాలో మరో రికార్డ్- కక్ష్యలోకి మూడో స్వదేశీ అణు గడియారం

అంతరిక్ష రంగంలో భారత్ మరో కీలక విజయాన్ని అందుకుంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన జీఎస్ఎల్వీ-ఎఫ్18 ప్రయోగం విజయవంతమైంది. ఈ రాకెట్ ద్వారా నింగిలోకి పంపిన నావిగేషన్ ఉపగ్రహం ఎన్వీఎస్-03 నిర్దేశిత ప్రవేశ కక్ష్యలోకి చేరుకుంది. నేవిగేషన్ ఉపగ్రహాన్ని నిర్దేశిత భూస్థిర కక్ష్యలోకి చేర్చడంతో శాస్త్రవేత్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రయోగం భారత అంతరిక్ష పరిశోధన రంగంలో మరో కీలక మైలురాయిగా నిలవనుంది. నిర్దిష్ట సమయం రాత్రి 11.51 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది. దాదాపు 24 గంటల కౌంట్‌డౌన్ అనంతరం ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. సుమారు 50 మీటర్ల ఎత్తున్న ఈ రాకెట్, దాదాపు 18 నిమిషాల ప్రయాణం తర్వాత తనలోని ఎన్వీఎస్-03 ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీఓ) లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. రాకెట్‌లోని మూడు దశలూ నిర్దేశించిన విధంగా పనిచేశాయి. ముఖ్యంగా అత్యంత సంక్లిష్టమైన క్రయోజెనిక్ పైదశ కూడా విజయవంతంగా



పనిచేయడంతో ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి చేర్చడం సాధ్యమైంది.నాలుగు ఉపగ్రహాలతో మళ్లీ నావిక్ సేవలుభాత్ సొంతంగా అభివృద్ధి చేసుకున్న ప్రాంతీయ నావిగేషన్ వ్యవస్థ నావిక్‌కు ఈ ప్రయోగం ఎంతో కీలకం. అమెరికాకు చెందిన జీపీఎస్ తరహాలో పనిచేసే ఈ వ్యవస్థ, భారత్‌తో పాటు దేశ సరిహద్దుల నుంచి సుమారు 1,500 కిలోమీటర్ల పరిధి వరకు నావిగేషన్ సేవలను అందించగలదు. ఇప్పటికే కక్ష్యలో పనిచేస్తున్న మూడు ఉపగ్రహాలకు ఎన్వీఎస్-03 తోడవడంతో మొత్తం నాలుగు ఉపగ్రహాలతో నావిక్ వ్యవస్థ సేవలు అందించేందుకు సిద్ధమైంది. ఎన్వీఎస్-03 ఉపగ్రహం లో స్వదేశీ రుబీడియం అణు గడియా రాన్ని అమర్చారు. ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థలో కచ్చితమైన సమయ నిర్ధారణ అత్యంత కీలకం. ఈ ఉపగ్రహంలో స్వదేశీ సాంకేతికతతో పాటు విదేశాల నుంచి సేకరించిన అణు గడియా రాలనూ వినియోగించారు. ఎల్1, ఎల్5, ఎస్ బ్యాండ్లలో సంకేతాలను ప్రసారం చేసే సామర్థ్యం దీనికి ఉంది. 2,232 కిలోల బరువున్న ఈ ఉపగ్రహం ప్రస్తుతం నిర్దేశిత ప్రవేశ కక్ష్యలోకి చేరింది.రైళ్లు, వాహనాలు, నౌకల ట్రాకింగ్‌కు ఉపయోగంఎన్వీఎస్-03 ఉపగ్ర హం అందుబాటులోకి రావడంతో నావిక్ సేవలు మరింత బలోపేతం కానున్నాయి. రైళ్ల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, రహదారులపై ప్రయాణించే వాహనాల స్థానాన్ని గుర్తించడం, సముద్రంలో ప్రయాణించే నౌకల కదలికలను ట్రాక్ చేయడం వంటి అనేక పౌర అవసరాలకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది. రవాణా రంగంతో పాటు భద్రత, విపత్తుల నిర్వహణ, ఇతర కీలక రంగాల్లోనూ ఉపగ్రహ నావిగేషన్ సేవలకు ప్రాధాన్యం ఉంది. విదేశీ నావిగేషన్ వ్యవస్థలపై ఆధారపడకుండా దేశీయంగా అభివృద్ధి చేసుకున్న సాంకేతికతను వినియోగించుకోవడం వ్యూహాత్మకంగా భారత్‌కు ప్రయోజనం చేకూర్చనుంది. అలాగే దేశవ్యాప్తంగా ప్రామాణిక సమయాన్ని అమలు చేయాలనే కేంద్ర ప్రభుత్వ 'ఒకే దేశం ఒకే సమయం' (ూఅవ చీఘ్ఘఅశీఅ, ూఅవ ూఅఎవ) ప్రాజెక్టులోనూ నావిక్ వ్యవస్థ కీలక పాత్ర పోషించనుంది. భారత ప్రామాణిక కాలమాన ను మరింత కచ్చితత్వంతో అందించేందుకు అవసరమైన సాంకేతిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో ఈ ఉపగ్రహాలు దోహదపడతాయి.56 రోజుల్లోనే మరో జీఎస్ఎల్వీ ప్రయోగంప్రయోగం సక్సెస్? కావడంపై ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ హర్షం వ్యక్తం చేశారు. నావిక్ వ్యవస్థ కేవలం దిశానిర్దేశ సేవలకే పరిమితం కాదని, దేశానికి వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన ఆస్తి అని ఆయన పేర్కొన్నారు. అంతరిక్ష సాంకేతికతలో భారత్ సాధిస్తున్న పురోగతికి ఈ విజయం నిదర్శనమన్నారు. విక్రమ్ సారాభాయ్, సతీశ్ ధావన్ వంటి అంతరిక్ష రంగ మార్గదర్శకుల కలలను సాకారం చేసే దిశగా దేశం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

సర్దార్ పటేల్ 151వ జయంతి.. జాతీయ ఐక్యతా దివస్ సందర్భంగా ప్రముఖుల నివాళులు!



ఢిల్లీ, అక్టోబర్ 31: భారత ఉక్కు మనిషి , దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా (అక్టోబర్ 31) దేశవ్యాప్తంగా 'జాతీయ ఐక్యతా దివస్' ఘనంగా జరుపుకుంటున్నారు. రాజధాని ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా పలువురు నాయకులు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఢిల్లీలో ప్రముఖుల అంజలిరాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి: ఢిల్లీలో ఏర్పాటు చేసిన స్మారక కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ పటేల్‌కు పుష్పాంజలి ఘటించారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధూ, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తదితరులు పాల్గొని పటేల్ చేసిన సేవలను స్మరించుకున్నారు. మహారాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కూడా పటేల్ జయంతి సందర్భంగా ప్రత్యేక నివాళులర్పించారు.ప్రధాని నరేంద్ర మోదీ సందేశంప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. సర్దార్ పటేల్‌ను 'అఖండ భారత్ శిల్పి' అని కొనియాడారు. బలమైన, సమర్థవంతమైన, స్వయంసమృద్ధి కలిగిన భారతదేశ నిర్మాణానికి పటేల్ తన జీవితాన్ని అంకితం చేశారని, ఆయన త్యాగం వికసిత భారత్ నిర్మాణానికి ప్రేరణ అని పేర్కొన్నారు.హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలుసర్దార్ పటేల్ ఆధునిక భారతదేశానికి పునాది వేసిన శిల్పి అని కొనియాడారు. సంస్థానాలను విలీనం చేసి దేశాన్ని ఒక్కటిగా నిర్మించడంలో ఆయన చూపిన ధైర్యం, సుదూర ఆలోచన చరిత్రాత్మకమైనవని పేర్కొన్నారు. ఆల్ ఇండియా సర్వీసెస్ ను ఏర్పాటు చేసి దేశ పాలనా వ్యవస్థకు బలమైన ఆధారాన్ని అందించారని, ఖేడా, బార్డోలీ సత్యాగ్రహాల ద్వారా రైతుల హక్కుల కోసం పోరాడారని అమిత్ షా గుర్తుచేశారు.

పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు.. 40 మంది అభ్యర్థులతో ఆప్ తొలి జాబితా.



పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కసరత్తు ప్రారంభించింది. 2027లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోయే 40 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను ప్రకటించింది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మరోసారి ధురి నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. అసెంబ్లీ స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వాన్‌కు కోట్‌కపురా టికెట్ కేటాయించారు. ఎన్నికలకు ఇంకా కొన్ని నెలల సమయం ఉండగానే అభ్యర్థులను ప్రకటించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది .ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో శుక్రవారం పార్టీ ముఖ్య నేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి భగవంత్ మాన్, పార్టీ పంజాబ్ ఇన్‌ఛార్జి మనీశ్ సిసోడియా తదితరులు పాల్గొన్నారు. అభ్యర్థుల ఎంపికపై చర్చించిన అనంతరం రాజకీయ వ్యవహారాల కమిటీ ఆమోదంతో శనివారం తొలి జాబితాను విడుదల చేశారు. పంజాబ్‌లో మొత్తం 117 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. తొలి జాబితాలో 40 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. మిగిలిన స్థానాలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగనుంది తొలి జాబితాలో ముఖ్యమంత్రి, మంత్రులకు చోటు కల్పించారు లూధియానా వెస్ట్ నుంచి పోటీ చేయనున్న మంత్రి సంజీవ్ అరోరా ప్రస్తుతం జైలులో ఉన్నారు. ఆయనకు పార్టీ మరోసారి టికెట్ కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. పంజాబ్‌లో ప్రస్తుత అసెంబ్లీ గడువు 2027 మార్చి 16తో ముగియనుంది. ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో జరిగే అవకాశం ఉంది. అయితే ఎన్నికల సంఘం ఇంకా అధికారిక షెడ్యూల్ ప్రకటించలేదు.

'దిల్లీ మార్చ్'కు రాహుల్ పిలుపు అనుమతి లేదన్న పోలీసులు దేశ రాజధానిలో రాజకీయ వేడి!

న్యూ ఢిల్లీ : నవంబర్ 1న దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండి కూటమి తలపెట్టనున్న భారీ ర్యాలీలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రజలకు పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు, పౌరులు, యువకులు అధిక సంఖ్యలో తరలిరావాలని అన్నారు. శనివారం తన 'ఎక్స్'? ఖాతాలో ర్యాలీకి సంబంధించిన వివరాలను ప్రకటించారు. ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు మింటో రోడ్- కన్నాట్ ప్లేస్ జంక్షన్ నుంచి ప్రారంభమయ్యే మార్చ్, రామ్‌లీలా మైదానం వరకు సాగుతుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఎన్నికల కమిషన్ కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్న తీరుపైనే ఈ నిరసన చేపడుతున్నట్లు రాహుల్? పేర్కొన్నారు. ర్యాలీలో పాల్గొనేందుకు ప్రజలు దిల్లీకి రాకుండా అడ్డుకునేందుకు అమిత్ షా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.మరోవైపు, రాహుల్?గాంధీ పోస్టుపై స్పందించిన దిల్లీ పోలీసులు, కన్నాట్ ప్లేస్ నుంచి మార్చ్ ప్రారంభించడానికి ఎటువంటి దరఖాస్తు అందలేదని పేర్కొన్నారు. అదే సమయంలో



ఎంపీలు, రాజకీయ నాయకులు తమ ప్రైవేట్ వాహనాల్లో కాన్స్టిట్యూషన్ క్లబ్‌కు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లడానికి ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. అలాగే, గతంలో నిరసనలకు వేదికైన జంతర్ మంతర్? ఎలాంటి కార్యక్రమాలు తలపెట్టరాదని ఇదివరకే ప్రకటించారు.ఇండి కూటమి ర్యాలీ నేపథ్యంలో దిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా రాంలీలా మైదానంలో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సెంట్రల్ డిస్ట్రిక్ట్ సహా పలు దిల్లీ పోలీస్ విభాగాలకు చెందిన సిబ్బంది, అదనంగా పారామిలిటరీ బలగాలను రంగంలోకి దించుతున్నారు. అలాగే దిల్లీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సెంట్రల్ దిల్లీలోని కీలకమార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు.ఇదిఎలాంటి కార్యక్రమాలు తలపెట్టరాదని ఇదివరకే ప్రకటించారు.ఇండి కూటమి ర్యాలీ నేపథ్యంలో దిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా లా ఉండగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్? కుమార్ అభిశంసన కార్యక్రమాన్ని, శనివారం మధ్యాహ్నం 3:30 గంటలకు మల్లికార్జున ఖర్గే నివాసంలో నిర్వహించేందుకు ఇండియా కూటమి నాయకులు సన్నద్ధమయ్యారు. వాస్తవానికి శుక్రవారమే నిర్వహించాల్సిన ఈ కార్యక్రమం వర్షం కారణంగా వాయిదా పడింది. సీనియర్ నాయకులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాహుల్ గాంధీ పేర్కొన్నారు.


చట్టం మౌనంగా ఉన్నప్పుడు రాజ్యాంగమే మార్గదర్శకం

న్యూఢిల్లీ: ఏదైనా ఒక అంశంపై చట్టం మౌనంగా ఉన్నప్పుడు అంటే స్పష్టమైన నిబంధనలు లేనప్పుడు న్యాయవ్యవస్థకు రాజ్యాంగమే దిశా నిర్దేశం చేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. సాంకేతికత ఎంత మారినప్పటికీ, రాజ్యాంగం ప్రజలకు కల్పించిన గౌరవం, స్వేచ్ఛ, సమానత్వం వంటి విలువలు ఎప్పటికీ మారవని ఆయన పేర్కొన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ఎదురవుతున్న సవాళ్లకు ఈ రాజ్యాంగ సూత్రాల ఆధారంగానే న్యాయస్థానాలు సమాధానాలు వెతకాలని పేర్కొన్నారు. దిల్లీ హైకోర్టు ఏర్పాటై 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం రోజు నిర్వహించిన వేడుకల ప్రారంభ కార్యక్రమంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజల హక్కులు, వారి గౌరవాన్ని కాపాడాలనే ప్రాథమిక బాధ్యతను దిల్లీ హైకోర్టు ఎప్పుడూ మర్చిపోకూడదని సూచించారు.దశాబ్దాల కిందటి వరకు కనీసం ఊహకు కూడా అందని సరికొత్త ప్రశ్నలు, సవాళ్లను న్యాయవ్యవస్థ ఇప్పుడు ఎదుర్కొంటోందని సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్టిఫిషియెల్ ఇంటెలిజెన్స్ (ూ×) సృష్టించిన ఒక క్రియేటివ్ కంటెంట్‌కు కాపీ రైట్ రక్షణ కల్పించవచ్చా? సమాజంలో అలజడి రేపుతున్న డీప్ ఫేక్స్ సాంకేతికతను చట్టం ఎలా ఎదుర్కోవాలి? సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూనే, అదే సమయంలో ఆ టెక్నాలజీ వల్ల పౌరుల



వ్యక్తిగత హక్కులకు భంగం వాటిల్లకుండా చట్టాన్ని ఎలా బ్యాలెన్స్ చేయాలి? వంటి ఎన్నో క్లిష్టమైన సవాళ్లు ఇప్పుడు కోర్టుల ముందుకు వస్తున్నాయని జస్టిస్ సూర్యకాంత్ ఈ సందర్భంగా గుర్తుచేశారు."ఏఐ సృష్టించిన కంటెంట్‌కు కాపీ రైట్ రక్షణ ఇవ్వొచ్చా? డీప్ ఫేక్ సవాళ్లకు చట్టం ఎలా స్పందించాలి? సాంకేతికత పేరిట పౌరుల వ్యక్తిగత హక్కులకు భంగం కలగకుండా ఆవిష్కరణలను ఎలా ప్రోత్సహించాలి? అనే ప్రశ్నలకు చట్టాల్లో నేరుగా సమాధానాలు దొరకవు. ఎక్కడైతే చట్టం మౌనంగా ఉంటుందో, అక్కడ రాజ్యాంగమే మనకు మార్గదర్శనం చేయాలి. రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ, సమానత్వం, గౌరవం అనేవి సాంకేతికత మారినంత మాత్రాన మారిపోవు."తన ప్రసంగంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సుప్రీం కోర్టుకు దిల్లీ హైకోర్టుతో ప్రత్యకమైన సంబంధం ఉందని కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ రెండు న్యాయస్థానాలు పక్కపక్కనే ఉండటం ఒక్కటే కారణం కాదని, దేశంలోని ఇతర హైకోర్టులతో పోలిస్తే దిల్లీ హైకోర్టు- సుప్రీం కోర్టుపై ఉన్న పని భారాన్ని గణనీయంగా తగ్గిస్తోందని వివరించారు. కొన్ని కేసుల విషయమై పిటిషనర్లు తమ దగ్గరికి వచ్చినప్పుడల్లా- 'దిల్లీ హైకోర్టు పక్కనే ఉంది కదా, ముందు దానిని ఆశ్రయిస్తే అక్కడ మీకు తగిన న్యాయం వేగంగా లభిస్తుంది' అని తాము న్యాయవాదులకు గుర్తుచేస్తుంటామని సీజేఐ వ్యాఖ్యానించారు. సుప్రీం కోర్టు విచారణకు రాకముందే అక్కడే అవసరమైన ఊరట లభించే అవకాశం ఉందని సూచిస్తామని తెలిపారు.1966లో కేవలం నలుగురు న్యాయమూర్తులతో ప్రారంభమైన దిల్లీ హైకోర్టు నేడు దేశ రాజధానిలో పరిపాలనా, రాజకీయ, వాణిజ్యపరమైన విభిన్నమైన, సంక్లిష్ట వివాదాల్ని పరిష్కరించే అత్యున్నత స్థాయికి ఎదిగిందని సీజేఐ అభినందించారు.ఇదే సమయంలో 'కొన్ని సందర్భాల్లో దిల్లీ హైకోర్టు న్యాయమూర్తులు, సుప్రీం కోర్టు న్యాయమూర్తుల కంటే ఎక్కువ శక్తిమంతమైన వారిగా' కనిపిస్తారని సరదాగా వ్యాఖ్యానించారు. సుప్రీం కోర్టు ఇతర న్యాయమూర్తులు, దిల్లీ హైకోర్ట్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నితిన్ వాసుదేవ్ సాంబ్రే, ఇతర న్యాయమూర్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

కోట్ల మంది హిందువుల ఓట్లు గల్లంతయ్యాయి.. సర్‌పై యూపీ సీఎం సంచలన వ్యాఖ్యలు..



లఖ్‌నవూ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సర్ ప్రక్రియ తర్వాత ఓటర్ల జాబితా నుంచి కోట్లాది మంది హిందువుల పేర్లు గల్లంతయ్యాయని ఆయన ఆరోపించారు. సుమారు 1.27 కోట్ల మంది హిందువులను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని పేర్కొన్నారు. అర్హులైన ఓటర్లందరినీ తిరిగి జాబితాలో చేర్చాల్సిన అవసరం ఉందని సీఎం నొక్కిచెప్పారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో యోగి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియ, హిందువుల ఓట్ల తొలగింపుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి యోగి మాట్లాడు తూ. సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులను హెచ్చరిం చారు.ప్రస్తుతం యూపీలో సుమారు 13 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, అయితే వాస్తవానికి ఆ సంఖ్య 16 కోట్లకు పైగా ఉండాలని సీఎం యోగి చెప్పారు. పంచాయతీ ఓటర్ల జాబితాలో పేర్లున్న 66 లక్షల మంది అసెంబ్లీ నియో జకవర్గాల జాబితాలో లేరని ఆరోపిం చారు. దీంతో 28 పట్టణ స్థానిక సంస్థల నియోజకవర్గాల్లో బీజేపీ బలహీన పడే పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న 55 లక్షల మంది పేర్లు కూడా ఓటర్ల జాబితాలో లేవని విమర్శించారు. అలాగే, 18-19 ఏళ్ల వయసున్న సుమారు 4.5 లక్షల మంది యువత ఓటర్ల జాబితాలో చోటు దక్కించుకోలేదని వెల్లడించారు. గత సర్ ప్రక్రియలో కేవలం నాలుగు లక్షల మందినే కొత్త ఓటర్లుగా చేర్చడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన ఓటర్లందరి పేర్లు జాబితాలో ఉండేలా చూడాలని, ఇందుకోసం బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలని పార్టీ కార్యకర్తలకు సీఎం సూచించారు.

మా దేశంలో అస్థిరతకు భారత్ కుట్ర: అజిత్ డోభాల్‌పై పాకిస్థాన్ ఆరోపణలు

న్యూఢిల్లీ: భారత్ తమ దేశంలో అస్థిరతను సృష్టించేందుకు ఉగ్రవాదాన్ని ఒక విధానంగా ఉపయోగిస్తోందని పాకిస్థాన్ తీవ్ర ఆరోపణలు చేసింది. లండన్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ (ఐఐఎస్ఎస్)లో జరిగిన ఓ కార్యక్రమంలో పాకిస్థాన్ నేషనల్ కమాండ్ అథారిటీ సలహాదారు, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ మజర్ జమిల్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. అక్టోబర్ 13న ఆయన చేసిన ప్రసంగానికి సంబంధించిన పూర్తి వివరాలు, రికార్డింగ్ తాజాగా బయటకు రావడంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశమైంది."దక్షిణాసియాలో అణు నిరోధకత, వ్యూహాత్మక స్థిరత్వం" అనే అంశంపై ప్రసంగించిన మజర్ జమిల్.. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్‌ను ప్రస్తావిస్తూ "డోభాల్ డాక్ట్రిన్"ను అమలు చేస్తూ పాకిస్థాన్‌ను బలహీనపరిచేందుకు భారత్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ), బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) వంటి ఉగ్రవాద సంస్థలకు భారత్ మద్దతిస్తోందని ఆయన ఆరోపణలు చేశారు. 1971 బంగ్లాదేశ్ యుద్ధ సమయంలో ముక్తి వాహినికి, 1980లలో ఎల్టీటీఈకి భారత్ మద్దతు ఇచ్చిందని, అలాగే 2001-2014 మధ్య ఆఫ్ఘనిస్థాన్-పాకిస్థాన్ సరిహద్దులో అనేక కాన్సులేట్లను నడిపిందని ఆయన చారిత్రక ఉదాహరణలను ప్రస్తావించారు.

తమిళనాడులో జైలు నుంచి ఖైదీల పరారీ.

తమిళనాడులోని థేని జిల్లా జైలు నుంచి 17 మంది విచారణ ఖైదీలు తప్పించుకున్న ఘటనపై ముఖ్యమంత్రి విజయ్ తీవ్రంగా స్పందించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు చేపట్టారు. డిప్యూటీ జైలు సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించడంతో పాటు జైలు సిబ్బందిని బదిలీ చేయాలని నిర్ణయించారు.థేని జిల్లా తెక్కంపట్టి సబ్‌జైలు నుంచి అక్టోబర్ 26వ తేదీ సోమవారం రాత్రి 17 మంది విచారణ ఖైదీలు తప్పించుకున్నారు జైలు భద్రతా సిబ్బందిపై దాడి చేసి ఖైదీలు బయటకు పారిపోయారు. ఖైదీల్లో ఒకరు మూర్ఛ వచ్చినట్లు నటించి వైద్య సహాయం కోరినట్లు అధికారులు వెల్లడించారు. గది తలుపు తెరిచిన సిబ్బందిపై ఖైదీలు దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ జైలు సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని ముఖ్యమంత్రి విజయ్ ఆదేశించారు. విధుల్లో ఉన్న ఇతర సిబ్బందిని కూడా బదిలీ చేయాలని సూచించారు.



ఇప్పటికే ఈ ఘటనకు సంబంధించి తొమ్మిది మంది జైలు సిబ్బందిపై సస్పెన్షన్ చర్యలు చేపట్టారుఖైదీలు తప్పించుకున్న వెంటనే పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు డ్రోన్ల సహాయంతో అటవీ ప్రాంతాల్లోనూ గాలింపు చేపట్టారు. తప్పించుకున్న 17 మందిని 43 గంటల్లో తిరిగి పట్టుకున్నట్టు పోలీసులు తెలిపారు. అనంతరం వారిని కట్టుదిట్టమైన భద్రత ఉన్న కేంద్ర కారాగారాలకు తరలించే ప్రక్రియ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జైళ్ల శాఖ ఉన్నతాధికారుల స్థాయిలో మార్పులు చేపట్టారు. జైళ్ల శాఖ డీజీపీగా ఉన్న సందీప్ రాయ్ రాథోడ్‌ను బదిలీ చేసి, ఆయన స్థానంలో కె. శంకర్‌ను నియమించారు. జైళ్లలో సీసీ కెమెరాలు, తనిఖీ పరికరాలు, భద్రతా వ్యవస్థలను మెరుగుపరచాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సంపాదకీయం



‘సర్’ లోపాలపై సుప్రీం అసహనం

ఎట్టకేలకు కోట్లాదిమంది ఓటర్లు, లక్షలాదిమంది యువత, ప్రతిపక్షపార్టీలు గత ఏడాదికిపైగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ లోని అవకతవకలపై చేస్తున్న న్యాయపోరాటం సుప్రీం కోర్టు వరిగణనలోకి రావడం చెప్పుకోదగిన అంశం. ఈ ప్రక్రియ అన్యాయమైనది, చట్టవిరుద్ధమైనది, రాజ్యాంగ విరుద్ధమైనది, ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకమైనదని ఓటర్లు, యువత, ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. సుప్రీం కోర్టు ఇదే విధంగా ముందుగానే స్పందించి ఉంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాడుతున్న వారికి ఎదురైన ఎన్నో ఇబ్బందులు, అనవసరమైన బాధలు తప్పి ఉండేవి. అంతేకాకుండా ఈ కాలంలో జరిగిన ఎన్నికలు ప్రజల నిజమైన అభిప్రాయాన్ని, వారు తమ పాలకులుగా ఎవరిని ఎన్నుకోవాలనుకుంటున్నారో వారి నిర్ణయాలను మరింత కచ్చితంగా ప్రతిబింబించి ఉండేవి.ఢిల్లీలో చేపట్టిన ‘సర్’ ప్రక్రియకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వం లోని ధర్మాసనం ఎన్నికల సంఘాన్ని కొన్ని కీలక ప్రశ్నలు అడిగింది. ఇప్పటికే ఓటరుగా నమోదైన వ్యక్తి ఏ కారణం చేతనో ఎన్యుమరేషన్ ఫారాన్ని తిరిగి ఎన్నికల సంఘానికి సమర్పించకపోతే అతని ఓటు హక్కును శాశ్వతంగా రద్దు చేస్తారా? ఓటరు జాబితా నుంచి తొలగించిన వ్యక్తులను మళ్లీ ఫారం 6 నింపి కొత్త ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవాలని కోరడం తప్పు కాదా? ఎవరైనా ఓటరు తన నివాసం చిరునామా మార్చుకుంటే ఆ కొత్త చిరునామా వివరాలను మాత్రమే తెలియజేసే అవకాశం ఎందుకు ఇవ్వకూడదు? ఎన్యూమరేషన్ ఫారాలను సమయానికి సమర్పించలేదని ఓటర్ల జాబితానుంచి తొలగించబడిన వ్యక్తులు, ఆ తర్వాత అదే ఫారాలను సమర్పించే అవకాశం ఎందుకు కల్పించకూడదు? అని అభ్యంతరాలు లేవదీసింది.అలాగే చట్టం నిర్దేశించిన పరిధిని మించి ఫారం6 లో మార్పులు చేయడానికి ఎన్నికల సంఘానికి ఏ అధికారం ఉందని నిలదీసింది. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా, ఢిల్లీ లోని మొత్తం 1.45 కోట్ల మంది ఓటర్లలో సుమారు 47లక్షల మంది పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితానుంచి తొలగించబడ్డాయి. ఈ 47లక్షల మంది ఓటర్లను తిరిగి సంప్రదించేందుకు, వారి వివరాలను నిర్ధారించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని సుప్రీం కోర్టు ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ప్రస్తుత ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) విధానంలో లోపం ఏమిటంటే ఓటర్ల నమోదు బాధ్యతను ప్రభుత్వం నుంచి ఓటర్ల బాధ్యతగా మార్చడం. ఒక వ్యక్తి కేవలం నివాసం మాత్రమే మార్చుకున్నా ఓటర్ల జాబితానుంచి అతని పేరును తొలగించేస్తున్నారు.బీహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితానుంచి తొలగించిన పేర్లలో 55% మంది ‘చిరునామా మార్చుకున్నారు’, లేదా ‘అందుబాటులో లేరు’ అనే కారణాలతో తొలగించబడ్డారు. ఈ పరిస్థితి సర్ మూడో దశలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 72 శాతానికి పెరిగింది. ఇవే కారణాలతో కర్ణాటకలో సుమారు 84లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. అయితే అభ్యంతరాలు, క్లెయిమ్‌ల దశలో కొత్త ఓటర్లతో కలిపి నికరంగా కేవలం 8.2లక్షల మందిని మాత్రమే జాబితాలో తిరిగి చేర్చారు. నివాసం మార్చుకున్న ఓటర్లను కొత్త ఓటర్లుగా మళ్లీ దరఖాస్తు చేసుకోమని కోరడం వల్ల ఎన్నికల సంఘం చారిత్రాత్మక లక్షమైన ఓటు హక్కును విస్తరించే విధానం దెబ్బతింటుంది. 2002 03లో ఓటర్ల జాబితా సవరణ సమయంలో ఓటర్లు నివాసం మార్చుకుంటే ఆ కొత్త నివాసానికి అధికారులు వెళ్లి అక్కడే ఓటర్లుగా నమోదు చేసేవారు.అదే సమయంలో వారి పాత ఓటరు నమోదు వివరాలను ముఖ్య ఎన్నికల అధికారి సమన్వయం చేసి సరిచూసేవారు. గతంలో ప్రభుత్వం, ఎన్నికల అధికారులు ఓటర్లను గుర్తించి వారి పేర్లను జాబితాలో చేర్చే బాధ్యత తీసుకునేవారు. కానీ ఇప్పుడు సర్ విధానంలో ఓటర్లే తమ పేర్లను తిరిగి నమోదు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఓటర్ల అర్హతను వారి కుటుంబ సభ్యుల సంఖ్య లేదా ఓటరుకు, వారి తల్లిదండ్రులకు మధ్య ఉన్న వయస్సు వ్యత్యాసం ఆధారంగా నిర్ణయించాలని ఏ చట్టం లేదా నిబంధన చెప్పడం లేదు.కానీ ఎన్నికల సంఘం ఇలాంటి అంశాల ఆధారంగా కొన్ని అసంబద్ధమైన, కంప్యూటర్ అల్గారిథమ్‌ల ఆధారిత ‘తార్కిక వ్యత్యాసాల తనిఖీలను’ చేపట్టింది. పశ్చిమబెంగాల్‌లో ఇలాంటి తనిఖీల కారణంగా 22లక్షల మంది ఓటు హక్కును కోల్పోవడం అత్యంత బాధాకరం. వీరంతా తమకు న్యాయం చేయాలని కోరుతూ కోర్టు ట్రిబ్యునళ్లను ఆశ్రయించారు.అలాగే ఢిల్లీలో ముస్లింలను ఇతరులతో పోలిస్తే ఎక్కువ సంఖ్యలో అనుమానాస్పద ఓటర్లుగా గుర్తించారు. ఓటర్ల అర్హతను నిర్ణయించడానికి ఎన్నికల సంఘం అనుసరిస్తున్న ‘తార్కిక వ్యత్యాసాల తనిఖీలకు చట్టబద్ధమైన ఆధారం ఉందా లేదా అనే విషయాన్ని కోర్టు తేల్చాలి. కోర్టు కేవలం ఓటరు నమోదు గడువును పొడిగించడం, ప్రాంతాల వారీ ముద్రించిన ఓటర్ల జాబితాలను ప్రదర్శించడం వంటి తాత్కాలిక పరిపాలనా పరిష్కారాలను మాత్రమే సూచించకూడదు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది. లక్షలాది మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయారని ఆరోపణలు ఎదురవుతున్న నేపథ్యంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని ఓటు హక్కును కాపాడాలని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై ఇంత తీవ్రమైన దెబ్బకొట్టిన ఎన్నికల సంఘాన్ని, ఆ సంఘాన్ని నిర్వహిస్తున్న బాధ్యులైన అధికారులను జవాబుదారీగా నిలబెట్టాలన్న అభిప్రాయం ఓటర్లలో కనిపిస్తోంది. అలాగే ప్రస్తుత ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను రద్దు చేసి, మొదటి నుంచి మళ్లీ ఈ ప్రకియను ప్రారంభించాలన్న వాదన వినిపిస్తోంది.



గెలిచినా దొంగ ఓట్లే అంటరు

కేంద్ర హోం మంత్రి అమిత్ షా గత వారం ఢిల్లీలో మాట్లాడుతూ, మరో 30 సంవత్సరాల పాటు బిజెపియే గెలుస్తుందని ధీమాగా ప్రకటించారు. అధికారం కోసం ప్రతిపక్షాలు కలలు కనవద్దన్నారు. ఆయన మాటలను బహుశా సందేహించనక్కర లేదేమో. ఎందుకంటే, ఓటర్ల జాబితాల నుంచి కోట్లాది మందిని తొలగించి, లక్షలాది మందిని అక్రమంగా చేర్చుతున్నట్లు వెలుగులోకి వస్తున్నపుడు ఎట్లా సందేహించగలం? అయితే అమిత్ షా గాని, ప్రధాని మోడీగాని, సంఘ్ పరివార్ గాని ఒకటి తెలుసుకోవాలి. వారు గెలిచినా అది దొంగ ఓట్లతో గెలవడమేననే అభిప్రాయం ఇప్పటికే స్థిర పడిపోయింది.‘సర్’ అవకతవకలు పొరపాటున జరుగుతున్నవో, చెదురు మదురైనవో కావు. ఉద్దేశపూర్వకంగా చేస్తున్నవనటానికి ఆధారాలు ఇప్పటికే కుప్పతెప్పలుగా బయటకు వచ్చాయి. ఇంకా వస్తూనే ఉన్నాయి. ఆ విషయమై ప్రజలనుంచి ఎన్ని ప్రశ్నలు ఎదురవుతున్నా మోడీ ప్రభుత్వపు దబాయింపులు, అధికార వక్షంనుంచీ, ఎన్నికల సంఘం నుంచి బుకాయింపులు, ఎదురు దాడులు, పోలీసులతో అణచివేతలు మినహా నవ్యమైన సమాధానాలు లేకపోవటాన్ని దేశమంతా చూస్తున్నది. అటువంటపుడు, అమిత్ షా ధీమాను నమ్మకుండా ఎట్లుండగలము. బిజెపి గెలుపు దొంగ ఓట్లతోనని భావించకపోవటం ఎట్లా సాధ్యమవుతుంది.ప్రముఖ ఆర్‌టిఐ యాక్టివిస్టు అంజలి భరద్వాజ్, ‘సర్’ ప్రక్రియను జరిపించాలన్న నిర్ణయం ఎవరిదంటూ ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘానికి ఒక ప్రశ్న పంపారు. అందుకు ఆ సంఘం ప్రిన్సిపాల్ సెక్రెటరీ జవాబిస్తూ, అది తమ నిర్ణయం కాదన్నారు. ఈ విషయాన్ని ఆమె జంతర్ మంతర్ వద్ద వెల్లడించటంతో అందరూ ఉలికి పడ్డారు. ఎన్నికల సంఘం చట్ట ప్రకారం స్వతంత్రమైన రాజ్యాంగ సంస్థ. వారికి ప్రభుత్వం ఎటువంటి ఆదేశాలు, నిర్దేశనలు, సూచనలు ఇచ్చేందుకు వీలు లేదు. విజ్ఞాపనలు మాత్రం చేయవచ్చు. ఆ పని ఏ పార్టీ అయినా, సంస్థ అయినా, వ్యక్తులైనా చేయవచ్చు. ‘సర్’ వంటి అత్యంత కీలకమైన ప్రక్రియ గురించిన నిర్ణయం మాత్రం ఎన్నికల సంఘం తీసుకోవలసిందే. మరి ఆ నిర్ణయం తమది కాదని సంఘం ప్రిన్సిపాల్ కార్యదర్శి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారంగే దాని అర్థం ఏమవుతుంది? మరెవరో నిర్ణయించారని, దానిని కమిషన్ అమలు పరిచిందని. అటువంటి నిర్ణయం తీసుకోగల శక్తి, స్థాయి ఎవరికి ఉంటుంది? ఆ నిర్ణయాన్ని అమలు చేయించగలది ఎవరు? పెద్దగా ఊహించనక్కర లేదు.గమనించవలసిందేమంటే, అంజలి భరద్వాజ్ ఈ విషయం వెల్లడించి వారం రోజులయింది. కాని ఇంతవరకు ఎన్నికల సంఘం ఆ మాటను ఖండించలేదు. దీనంతటిని బట్టి, ‘సర్’ నిర్ణయం మోడీ ప్రభుత్వానిదని భావించకతప్పదు. ఇంతకూ అటువంటి కీలకమైన నిర్ణయం ఎందుకు తీసుకున్నట్లు? ఇందుకు



సమాధానాన్ని కూడా పెద్దగా ఊహించనక్కరలేదు. ఈ మలుపు, అందరూ ఇప్పటికే మాట్లాడుతున్నట్లు, బిజెపి లోక్‌సభ సీట్లు 2024 ఎన్నికలలో తగ్గి, స్వంత మెజారిటీని కోల్పోయి, ఇతర పార్టీలపై ఆధారపడక తప్పని దుస్థితి ఏర్పడటంతో మొదలైంది. మామూలుగా ఇతరులతో కలిసి ఎన్‌డిఎ కూటమిని ఏర్పాటు చేయటం వేరు. అది వాజపేయి కాలం నుంచి ఉన్నదే. కాని, రెండు సార్లు (2014, 2019) వచ్చిన స్వంత మెజారిటీ 2024లో పోవటం భూకంపం వంటిది. ఆ స్థితి రాజకీయంగానే ఆందోళనకరం కాగా, మోడీ వంటి అ ప్రజాస్వామికునికి, అహంభావికి అది అవమానకరం కూడా అయిందనాలి.పరిస్థితి అదే విధంగా కొనసాగితే ఏమైనా జరగవచ్చు. అందువల్ల మొదలైంది క్రీడ. 2024 లోక్‌సభ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో వీలైనన్ని గెలవనట్లయితే 2029 లోక్‌సభ నాటికి ప్రమాదం ముంచుకు వచ్చినట్లే. ఆ విధంగా ‘సర్’ వన్నాగం రూపు తీసుకుంది. అంజలి భరద్వాజ్ ఆర్‌టిఐ ప్రశ్నకు వచ్చిన సమాధానాన్ని గమనించినపుడు, ‘సర్’ నిర్ణయంతో పాటు అందులో భాగంగా ఎటువంటి అక్రమాలు జరగాలనే దంతా మోడీ యంత్రాంగమే ప్రణాళిక రచించి, ఎన్నికల సంఘం ద్వారా అమలు చేయించిందనే అభిప్రాయం అనివార్యంగా కలుగుతుంది. ఈ విషయమై అనుమానాలు, విమర్శలు ఎన్ని ఉండినా, కొన్ని ఆధారాలు తరచు వెల్లడి అవుతున్నా, ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరి అభ్యంతరాలు అకస్మాత్తుగా వెలుగులోకి రావటంతో తుఫాను మొదలు కావటం తెలిసిందే. ప్రభుత్వం తేలుకుట్టిన దొంగవలె అసలు ప్రశ్నపై మౌనం వహించి, ఒక నికార్సయిన నియంతవలె అణచివేత చర్యలు మొదలుపెట్టింది. ఆర్‌టిఐ ప్రశ్న జవాబుల వంటివే వలు ఉదంతాలు పాముల పుట్ట బద్దలైనట్లు ఇంకా బయటపడుతున్నాయి. తాజా కేసు ఉత్తర ప్రదేశ్‌లోని పిలిభిత్ అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించినది. ఓటర్ల తుది జాబితా ప్రకటితమైన తర్వాత అందులోని పేర్లను, ఓటర్ల పేర్లను పోల్చిచూడగా పదివేలకు పైగా పేర్లు పొరపాటుగా కనిపించాయి. అనగా వారు ఓటు వేయలేకపోయారన్న మాట. అక్కడ బిజెపి అభ్యర్థి కేవలం రెండు వేల ఓట్లతో గెలిచాడు. ఈ అవకతవకలను ఓటర్ల పక్షాన లాయర్లు కనుగొని ఫిర్యాదు చేయటంతో, ఇద్దరు అధికారులు, ఒక ఆపరేటర్ కలిసి ఆ పని చేసినట్లు వెల్లడైంది. వారిపై చర్యలు సరే. కాని ఆ ఎన్నిక ఫలితం మాటేమిటి? 2024 లోక్‌సభ తర్వాత బిజెపి గెలిచిన యుపితోపాటు బీహార్, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ అన్నీ దొంగ ఓట్ల విజయాలేనన్న మాట. బెంగాల్‌లోనూ ఓట్లు కోల్పోయిన కొందరు ట్రిబ్యునల్స్‌కు అప్పీలు చేయగా, అందులో సుమారు 90 శాతం తీర్పులు వారికి అనుకూలంగా రావటం తెలిసిందే. ఇటీవలనైతే ఫారం 7, ఫారం 8 అక్రమాలు వరుసగా వెల్లడవుతున్నాయి. బతికున్న వారిని చనిపోయినట్లు చూపుతూ, ఇల్లు మారకున్నా మారినట్లు చెప్తూ, ఉన్న ఓటర్లపై అభ్యంతరాలున్నట్లు వారికి తెలియకుండా మరెవరో దరఖాస్తు చేయగా అధికారులు విచారణ జరపకుండా ఓట్లను రద్దు చేస్తూ పోవటాలు జరుగుతున్నాయి. ఈ పని చేస్తున్నదంతా బిజెపి నాయకులు. అందుకు గురవుతున్నది అధికంగా ముస్లిములు. ఇవన్నీ సముద్రంలో నీటిబొట్టు వంటివని, మొత్తం తొలగించిన ఓట్లు 13 కోట్లన్న లెక్క తేలటంతో అందరికీ అర్థమైపోయింది. ఇది ఇంకా తుది సంఖ్య కాకపోవటం గమనించదగ్గది. ఇందులో నిజంగానే చనిపోయినవారు, అడ్రసులు మారినవారు ఉన్నారని కొన్ని లెక్కలు చెప్తున్నారు. ఆ లెక్కలలో నిజాయితీ ఎంతనో తేలేది ఎట్లా? పైగా, కమిషన్ చెప్తున్న లెక్కలన్నీ కూడినా 13 కోట్లలో సగమైనా కావటం లేదు. మరి కొన్ని రాష్ట్రాల సోకాల్డ్ తుది జాబితాలు ఇంకా ప్రకటించవలసి ఉన్నది కూడా. మొత్తం మీద అమిత్ షా ధీమాకైతే ఆధారాలు చాలానే కనిపిస్తున్నాయి. 2029 ఎన్నికల నాటికి ఈ ‘సర్’ వ్యవహారం ఎట్లా తేలేదీ చెప్పలేముగాని, ప్రజలూ, ప్రతివక్షాలు, యువతంర ఎన్నెన్ని ఆందోళనలు జరిపినా లెక్కచేయక, వారిని అణచివేస్తూ ముందుకు సాగుతున మోడీ ప్రభుత్వం, అమిత్ షా ధీమాగా ప్రకటించినట్లు తిరిగి అధికారానికి వస్తే ఆశ్చర్య పడనక్కర లేదేమో. ఒకసారి కాదు. మరొక 30 సంవత్సరాల పాటు. అయితే, 2024 తర్వాతి అసెంబ్లీ విజయాలన్నీ దొంగ ఓట్లతోనేనని ప్రజలకు ఈసరికి అర్థమైనందున, 2029 లోక్‌సభ గెలిచినా అది తిరిగి దొంగ ఓట్లతోనేననటంలో ఎవరికీ సందేశం ఉండబోదు. ఒక మహత్తర సంస్కృతి గురించి మాట్లాడే సంఘ్ పరివార్‌కు, ఒక ‘విశ్వగురు’ చిత్రాన్ని ఆకాశానికి ఎత్తి పట్టుకునే బిజెపి పార్టీకి, దేశాన్ని అపూర్వమైన రీతిలో అత్యద్భుతమైన రీతిలో అభివృద్ధి పరుస్తున్నట్లు చాటుకునే ప్రభుత్వానికి, చివరకు దొంగ ఓట్లతో, ప్రజలను అణచివేస్తూ గెలవవలసిన దుస్థితి ప్రాప్తించిందంటే, వారిని చూసి దేశమే సిగ్గుపడవలసి వస్తున్నది.

కార్మికుల రక్షా కవచం ఎఐటియుసి



భారతదేశ కార్మికోద్యమ చరిత్రలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి)కు ప్రత్యేక స్థానం ఉంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశస్వాతంత్ర పోరాటంలో ప్రముఖ పాత్ర వహించింది.దేశపారిశ్రామిక అభివృద్ధిలో కార్మికుల శ్రమకు గుర్తింపు లభించాలంటే వారి సమస్యలపై సంఘటిత పోరాటం అవసరమనే భావనకు ఎఐటియుసి చరిత్ర నిదర్శనం. 1917లో రష్యాలో అక్టోబర్ విప్లవానంతరం వివిధ దేశాలలో అప్పటికే వివిధ పరిశ్రమలలో పనిచేయు కార్మిక వర్గం తక్కువ వేతనాలు, సుదీర్ఘ పనిగంటలు, ప్రమాదకరమైన పని పరిస్థితులు, కనీన సౌకర్యాల లేమితో సతమతమయ్యేవారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో విడివిడిగా సాగుతున్న కార్మిక పోరాటాలను జాతీయస్థాయిలో సమన్వయం చేయాలనే లక్ష్యంతో 1920 అక్టోబర్ 31న బొంబాయిలో ఎఐటియుసి ఏర్పడింది. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజపతిరాయ ఎఐటియుసి తొలి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు.జోసెఫ్ బాప్టిస్టా, ఎన్ ఎం జోషి, దివాన్ చమన్ లాల్ వంటి నాయకులు సంస్థ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. 1927 లో ఈ సంస్థకు అధ్యక్షులుగా జవహర్ లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, వి వి. గిరి లాంటి స్వాతంత్ర్య యోధులు అధ్యక్షులుగా కొనసాగారు. కార్మిక సమస్యలను జాతీయ రాజకీయాల చర్చలోకి తీసుకురావడం, కార్మికులకు సంఘటిత శక్తి అవసరాన్ని చాటడం ఈ సంస్థ ప్రారంభ దశలో ప్రధాన లక్ష్యాలుగా నిలిచాయి. ఉద్యమ కాలంలో కార్మిక హక్కులు, జాతీయ స్వాతంత్ర్యం, సామాజిక సమానత్వం వంటి అంశాలు పరస్పరం ముడిపడ్డాయి. అనంతరం వేతనాలు, పని పరిస్థితులు, కార్మిక చట్టాలు, సామాజిక భద్రత, ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ వంటి అంశాలపై ఎఐటియుసి తన కార్యకలాపాలను కొనసాగించింది. కార్మిక సంఘాల మధ్య వివాదాస్పదమైన భేదాలు, చీలికలు ఉన్నప్పటికీ భారత కార్గో చరిత్రలో ఈ సంస్థ పాత్ర ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. హైదరాబాద్ రాష్ట్ర సంస్థానంలో రాజకీయాల పైన, సంఘాల పైన నిషేధం ఉన్న నేపథ్యంలో ఆలస్యంగా 1939 లో ఆల్ హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ ద్వారా కార్మిక సంఘాల నిర్మాణం, ఉద్యమాలు విస్తరణకు మఖ్దుం మొహియుద్దిన్, రాజ్ బహదూర్ గౌర్ వంటి నాయకులు కృషి చేశారు. ఈ దశాబ్ద కాలంలో ఎఐటియుసి కార్మికుల హక్కులకై సుదీర్ఘ కాలంగా పోరాడుతూ కార్మికవర్గ హక్కులను కాపాడుకుంటూ వస్తుంది. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 చట్టాలను.. కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు కోడలుగా మార్చడం జరిగింది. కార్మిక హక్కులపై దాడులకు ప్రోత్సహిస్తున్నారు. కార్మిక సంఘాలు పెట్టుకోలేని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో కార్మికులు మరింత సంఘటిత శక్తిగా ఉద్యమాలకు సిద్ధం కావలసిన అవసరమున్నది.రెండవ వైపు నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం, భావ ప్రకటన స్వేచ్ఛ, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసే హక్కు, మతాలు, సంస్కృతులు, భాషల బహుళత్వ హక్కు వంటి భారత రాజ్యాంగంలోని మూల విలువల పైన నిరంతరంగా, ప్రణాళికబద్ధంగా దాడి చేస్తున్నది. ఇప్పుడు ఈ దాడి, మన సొంత దేశంలో మనకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి, మెరుగైన జీవితం కోసం మన అంచనాలను అందుకునే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ఓటరుగా మారే హక్కుపై స్పష్టంగా, నిస్సందేహంగా బట్టబయలైంది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం విదేశీ కార్పొరేట్లకు వివిధ మార్గాల ద్వారా భారీ అవినీతికి పాల్పడుతూన్నది. రోజురోజుకు పట్టుకోల్పోతున్న తరుణంలో ఓటర్లకు వారి రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును హరించడానికి మోడీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని ఒక సాధనంగా ఉపయోగించుకుంటున్నది. అందుకే ‘ఓట్ చోర్ గద్ది చోడ్’ అని నినాదం ఊపందుకుంది. ఇది భారత రాజ్యాంగాన్ని పరిరక్షించే పోరాటం. ప్రజలను రక్షించడమే లక్ష్యంగా సాగే పోరాటమనీ, ‘దేశాన్ని రక్షించండి’ అంటూ అక్టోబర్ 31వ తేదీని రక్షణ దినోత్సవంగా జరుపుకుంటున్నామని ఎఐటియుసి తన యూనియన్లకు పిలుపునిచ్చింది.

సీసంతో "కుంకుమ కల్తీ"! - పిల్లలకు, పెద్దలకు ముప్పు! - నకిలీది ఇలా కనిపెట్టండి!



హిందూ సంప్రదాయంలో కుంకుమకు ప్రత్యేక స్థానం ఉంది. పూజలు, వ్రతాల సమయంలో విరివిగా ఉపయోగిస్తుంటారు. ఇక ఇది సౌభాగ్యానికి చిహ్నం కూడా. అందుకే పెళ్లైన స్త్రీలు నుదిటి మీద ధరించడంతో పాటు పాపిట్లో పెట్టుకుంటుంటారు. కేవలం వారు మాత్రమే కాకుండా, పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ధరిస్తారు. అయితే ఇంత ప్రత్యేకత కలిగిన కుంకుమ కూడా కల్తీకి గురవుతుంది. ఇక ఇలాంటి సిందూరం కొంటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అందుకే కొనేముందే కుంకుమ నాణ్యతను చెక్? చేసుకోవడం తప్పనిసరి అని చెబుతున్నారు నిపుణులు. అది ఎలాగో ఇప్పుడు చూద్దాం.
కల్తీ కుంకుమతో ఎదురయ్యే సమస్యలు ఇవే:
సహజంగా తయారుచేసిన కుంకుమ ముదురు ఎరుపు రంగులో ఉంటుంది. లేదంటే కాస్త ఆరెంజ్ షేడ్‌లో దొరుకుతుంది. అయితే కొంతమంది వీటికి ఆర్టిఫిషియల్ కలర్స్??, మెరిసేలా చేయడానికి కొన్ని కెమికల్స్?.. ముఖ్యంగా సీసం కలుపుతుంటారని చెబుతున్నారు. ఇలాంటి కల్తీ కుంకుమ వాడటం వల్ల చాలా మందిలో చర్మ సంబంధిత అలర్జీలు, ర్యాషెస్, దురద, ఆ ప్రదేశంలో చర్మం ఎరుపెక్కడం.. వంటి లక్షణాలు కనిపిస్తాయంటున్నారు.
మరికొందరిలో ఆ చర్మ భాగం నల్లగానూ మారుతుంటుందంటున్నారు. అలాగే కల్తీ కుంకుమను దీర్ఘకాలం పాటు వాడితే.. పిల్లల్లో చిరాకు, నేర్చుకునే సామర్థ్యం తగ్గడం, వినికిడి లోపం, ఏకాగ్రత లోపించడం వంటి సమస్యలు వస్తాయని న్యూజెర్సీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ వెల్లడించింది. ఇక పెద్దవారికి హైబీపీ, జ్ఞాపకశక్తి తగ్గడం సహా పురుషులలో వీర్యకణాల సంఖ్య, వాటి నాణ్యత తగ్గడం, మహిళల్లో గర్భస్రావం లేదా నెలలు నిండకుండానే కాన్పు జరగడం వంటి సమస్యలు ఎదురవుతాయని స్పష్టం చేసింది.కల్తీ కుంకుమను ఎలా గుర్తించాలి:
అటు ఆరోగ్యపరంగా, ఇటు సౌందర్య పరంగా ఆయా సమస్యలు రాకుండా నివారించాలంటే.. కొనే ముందే కుంకుమలోని కల్తీని కనిపెట్టడం మంచిదంటున్నారు నిపుణులు. ఇందుకోసం కొన్ని చిట్కాలు మేలు చేస్తాయని చెబుతున్నారు.కుంకుమ సహజ రంగులో కాకుండా గులాబీ, కాషాయం, మరీ ముదురుగా.. ఇలా విభిన్న రంగుల్లో కృత్రిమ రంగులు ఉపయోగించి తయారుచేసిందే అని విషయాన్ని గుర్తించాలంటున్నారు నిపుణులు. అందుకే ఇలాంటి రంగుల్లో ఉన్న కుంకుమ కొనకపోవడమే మంచిదంటున్నారు.
నేచురల్?గా తయారుచేసిన కుంకుమ చేతికి అంటుకుంటే నీరు లేదా సబ్బుతో కడిగితే తేలికగా తొలగిపోతుందని చెబుతున్నారు. అలా కాకుండా సబ్బుతో రుద్దినా కుంకుమ రంగు పోకపోతే అందులో కెమికల్స్? కలిపినట్లు అర్థం చేసుకోవాలంటున్నారు.
కొన్ని కుంకుమలు చూడ్డానికి సాధారణ పొడిలా కాకుండా.. ప్రకాశవంతంగా మెరుస్తూ కనిపిస్తాయని.. హానికారక డైలు, రసాయనాలు కలపడం వల్లే వీటికి ఈ లుక్ వస్తుందని చెబుతున్నారు. అందుకే ఇలాంటి వాటిని కొనుగోలు చేయడం మానుకోవాలంటున్నారు. అలాగే సాధారణ కుంకుమకే మెరుపులు కలిపిన సిందూరం కూడా మార్కెట్లో దొరుకుతుందని.. అదీ వద్దంటున్నారు.
సహజసిద్ధంగా తయారుచేసిన కుంకుమ ఒక రకమైన సువాసనను కలిగి ఉంటుందని చెబుతున్నారు. అయితే మీరు కొనుగోలు చేసిన కుంకుమ మంచి స్మెల్? కాకుండా గాఢమైన వాసన వచ్చినా, ఒక రకమైన లోహపు వాసన వచ్చినా కల్తీ కుంకుమగా పరిగణించి, దానిని దూరం పెట్టాలంటున్నారు.
ఫుడ్? సహా కొనుగోలు చేసే చాలా వస్తువులపై ఉండే లేబుల్‌ని పరిశీలిస్తాం. కానీ కుంకుమ ప్యాకెట్/బాక్స్‌ని ఉన్న దానిని అంతగా పరిశీలించరు. కానీ ఈ నిర్లక్ష్యం మంచిది కాదంటున్నారు నిపుణులు. దీని తయారీలో ఏమేం వాడారో చెక్ చేసుకున్నాకే కొనడం మంచిదని సూచిస్తున్నారు. అలాగే సరైన సర్టిఫికేషన్ ఉన్న బ్రాండెడ్ కుంకుమను కొనడం, కొనేముందు ఆ లేబుల్‌నీ పరిశీలించడం ముఖ్యమంటున్నారు.

ఆలయంలో నవగ్రహాలను ఎందుకు పూజించాలి? ఏ గ్రహానికి ఏ ఫలం లభిస్తుందో తెలుసా?



మన ఇష్టదైవాన్ని కళ్లారా దర్శించుకుని, మనసారా పూజించుకుని, మన మనసులోని కోరికలు స్వామికి విన్నవించుకోవడానికే మనం ఆలయాలకు వెళ్తుంటాం. సాధారణంగా ప్రతి శివాలయంలో నవగ్రహాల మండపం కనిపిస్తుంది. మూలవిరాట్టును దర్శించిన తర్వాత నవగ్రహాలను కూడా పూజించడం సర్వ సాధారణం. అయితే ఆలయ ప్రాంగణంలో ఉన్న నవగ్రహాలను ఎందుకు పూజించాలి? ల ఆరాధన వెనుక అంతరార్థం ఏమిటి? అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.

నవగ్రహం అంటే?

గ్రహం అంటే గ్రహించేది అని అర్థం. సూర్యుడు ఒక నక్షత్రం! చంద్రుడు ఓ ఉపగ్రహం, రాహుకేతువులు ఛాయాగ్రహాలు. ఇది అందరికీ తెలిసిందే! అయినప్పటికీ వీటితోపాటు మరో ఐదు గ్రహాలను కలిపి నవగ్రహాలుగా చేయడం వెనుక ఓ పరమార్థం ఉంది.

తొమ్మిది పూర్ణసంఖ్య!

జ్యోతిష శాస్త్రం, సంఖ్యా శాస్త్రాన్ని అనుసరించి తొమ్మిది పూర్ణసంఖ్యగా పేర్కొంటారు. సంఖ్యల్లో తొమ్మిది చివరి సంఖ్య. తొమ్మిది తరువాత ఒకటి పక్కన సున్నా చేరిస్తేనే పది అవుతుంది అంతేకాని కొత్తగా మరో సంఖ్య ఏమీ రాదు. అలాగే తొమ్మిదిని ఏ సంఖ్యతో గుణించిన తొమ్మిదే వస్తుంది. ఇది సంఖ్యాశాస్త్రంలో ఓ అద్భుతం. మానవ శరీరంలో ప్రధానంగా ఉండేవి నవరంధ్రాలు. వీటి ద్వారానే జీవన క్రియ మొత్తం సాగుతుంది. అందుకే తొమ్మిది సంఖ్యను పరిపూర్ణమైన సంఖ్య అంటారు.

నవగ్రహ ఆరాధన తప్పనిసరి

ఇక నవగ్రహాల విషయానికి వస్తే, నవగ్రహాలకు అధిపతి సూర్యుడు. ఈ నవగ్రహాలు మన జీవితంపై అసాధారణమైన ప్రభావాన్ని చూపుతాయి. ఈ ప్రభావం కారణంగానే శుభ అశుభ ఫలితాలు ఏర్పడుతాయని జ్యోతిష శాస్త్ర పండితులు చెబుతారు. మన నిత్యజీవితంలో అశుభ ఫలితాలు తొలగి, శుభ ఫలితాలు పొందాలంటే నవగ్రహాలను తప్పకుండా ఆరాధించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా నవగ్రహాల్లో ఏ గ్రహం మానవునికి ఎలాంటి ఫలితాన్ని అందిస్తాయో చూద్దాం.
సూర్యుడుసూర్యుడు గ్రహాధిపతి. నవగ్రహాలకు రాజు వంటివాడు. ఆదివారం సూర్యునికి ప్రీతికరమైన వారం. అసలు ప్రతి రోజూ క్రమం తప్పకుండా సూర్యుని ఆరాధిస్తే, ఆ సూర్య భగవానుడు మానవాళికి శక్తిని, ఆత్మవిశ్వాసాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడు. చంద్రుడు జ్యోతిష శాస్త్రం ప్రకారం చంద్రుని మనఃకారకుడని అంటారు. అంటే చంద్రుడు మనో విచారాన్ని తొలగించి మానసిక సంతోషాన్ని కలుగజేస్తాడని అంటారు. సోమవారానికి అధిపతి చంద్రుడు. ప్రతిరోజూ చంద్రుని ఆరాధిస్తే మానసిక ఉద్వేగాలను నియంత్రించి, మానసిక ఆనందాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తాడు. బంధాలను దృఢంగా మారుస్తాడు. కి శక్తిని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడు.చంద్రుడుజ్యోతిష శాస్త్రం ప్రకారం చంద్రుని మనఃకారకుడని అంటారు. అంటే చంద్రుడు మనో విచారాన్ని తొలగించికుజుడుకుజుడు మంగళ కారకుడు. మంగళవారానికి అధిపతి కుజుడు. వివాహయోగం కలగాలన్నా, సంతానప్రాప్తి కలగాలన్నా కుజ గ్రహ అనుకూలత ముఖ్యం. ప్రతిరోజూ కుజుని ఆరాధించే వారికి కుజుడు మనోధైర్యాన్ని, సమస్యలను అధిగమించే శక్తిని ప్రసాదిస్తాడు.బుధుడుబుధుడు బుద్ధికారకుడు. బుధునికి ప్రీతికరమైన వారం బుధవారం. ప్రతిరోజూ బుధుని ఆరాధిస్తే మంచి విద్య, జ్ఞానం, విజ్ఞానం లభిస్తాయని, ఆలోచనలో పరిణితి ఏర్పడుతుందని విశ్వాసం.
గురుడుబృహస్పతిగా పిలుచుకునే గురు గ్రహం అత్యంత శుభ గ్రహం. గురువారానికి అధిపతి గురుడు. ఒక్క గురుగ్రహం అనుకూలత ఉంటే చాలు తక్కిన గ్రహాల అనుకూలత లేకపోయినా విశేషమైన శుభ ఫలితాలు పొందవచ్చు. ప్రతిరోజూ గురుని ఆరాధించడం వల్ల జీవితంలో అభివృద్ధి, ఆధ్యాత్మిక జ్ఞానం వృద్ధి చెందుతాయి.శుక్రుడునవగ్రహాల్లో శుక్రుడు శుభ గ్రహం. శుక్రవారానికి అధిపతి శుక్రుడు. ప్రతి రోజు శుక్రుని ఆరాధిస్తే ప్రేమ, విలాసాలు, భోగభాగ్యాలు, అందం, ఆనందం ఇలా జీవితానికి కావాల్సినవన్నీ అందిస్తాడు.
శని భగవానుడుశని పేరు చెబితేనే చాలు భయపడి పోవడం సహజం. నిజానికి శని న్యాయదేవత! మనం చేసిన పాపపుణ్యాలను తగిన ఫలితాలను అందించేవాడు శని భగవానుడు. శనివారానికి అధిపతి శనిదేవుడు. ప్రతిరోజూ శనిభగవానుని ఆరాధించడం వల్ల క్రమశిక్షణ, చేసిన కష్టానికి తగిన ప్రతిఫలం, దీర్ఘకాలంలో అభివృద్ధిని సాధించవచ్చు.
రాహువుజ్యోతిష శాస్త్రం ప్రకారం రాహువు ఛాయాగ్రహం. మనకు ఏదైనా గందరగోళ పరిస్థితి ఎదురైనప్పుడు రాహువును పూజిస్తే గందరగోళాన్ని తొలగించి, జీవితంలో ఎదురయ్యే ఆటంకాలను అధిగమించే శక్తిని ప్రసాదిస్తాడు.కేతువుజ్యోతిష శాస్త్రం ప్రకారం కేతువు కూడా ఛాయాగ్రహమే! కేతువు గతజన్మల పాపఫలాన్ని తగ్గిస్తాడని విశ్వాసం. అందుకే కేతువును ఆరాధించడం వల్ల జీవితంలో పాపఫలంగా ఎదురయ్యే సమస్యలు తొలగి సానుకూలత పెరుగుతుంది.
నవగ్రహ ఆరాధన ఫలంఆలయానికి వెళ్లినప్పుడు ముందుగా నవగ్రహ మండపానికి వెళ్లి నవగ్రహాలకు ప్రదక్షిణలు చేయడం ఎంతో ముఖ్యం. నవగ్రహ శ్లోకాలు చదువుకుంటూ 9 కానీ 11 కానీ ప్రదక్షిణలు చేయాలి. నవగ్రహాలను ఎప్పుడూ తాకరాదు. నవగ్రహాలకు ప్రదక్షిణలు చేయడం పూర్తయ్యాక కాళ్లు కడుక్కోవాలి అంటారు కానీ అది కేవలం అపోహ మాత్రమే! నవగ్రహాలకు ప్రదక్షిణలు చేగురుడు. ఒక్క గురుగ్రహం అనుకూలత ఉంటే యడం పూర్తయ్యాక ఆలయంలోని మూలవిరాట్టును దర్శించుకోవడం ప్రధానం. జీవితంలో ఎదురయ్యే అవరోధాలను అధిగమించడానికి కావాల్సిన శక్తిని, ధైర్యాన్ని పొందడానికి, శారీరక మానసిక ఆరోగ్యాలు పొందడానికి నవగ్రహాల ఆరాధన తప్పనిసరిగా చేయాలని పండితులు చెబుతారు. మనం కూడా నవగ్రహాలను ఆరాధించి సుఖశాంతులను పొందుదాం.శుభం భూయాత్!ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

మొటిమల నుంచి వృద్ధాప్య ఛాయలను పోగొట్టే వరకు - పసుపు నూనెతో ఎన్నో బెనిఫిట్స్?!



'పసుపు' లేని ఇల్లు ఉండదంటే అతిశయోక్తి కాదు. భారతీయ సంస్కృతిలో దీనికి ప్రత్యేక స్థానమే ఉంది. ఇక దీని వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు. అయితే, ఆరోగ్యానికే కాదు సౌందర్య పోషణలోనూ పసుపుది అగ్రస్థానమే. అయితే కేవలం పసుపు మాత్రమే కాదు దీని మొక్క వేళ్ల నుంచి తీసిన ఎసెన్షియల్ ఆయిల్ వల్ల కూడా ఎన్నో ప్రయోజనాలున్నాయంటున్నారు సౌందర్య నిపుణులు. అవేంటి? సౌందర్య పోషణలో ఈ నూనెను ఎలా ఉపయోగించాలి? అనే వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.చర్మం తాజాగా: కొన్నిసార్లు చర్మం నిర్జీవంగా కనిపిస్తుంటుంది. ఇలాంటప్పుడు ఒకటిన్నర చెంచా ఆలివ్ ఆయిల్‌లో పసుపు వేళ్ల నుంచి తీసిన ఎసెన్షియల్ ఆయిల్‌ని ఒక్క చుక్క వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చర్మంపై రాసుకుని మృదువుగా మర్దన చేసుకోవాలని, ఇలా రోజూ రాత్రి పడుకునే ముందు చేయడం వల్ల అలసిన చర్మం తిరిగి తాజాదనాన్ని సంతరించుకుంటుందని చెబుతున్నారు నిపుణులు.మొటిమల నుంచి: సీబమ్ ఉత్పత్తి పెరగడం వల్ల చర్మంపై ఎక్కువ నూనె ఉత్పత్తి అయ్యి జిడ్డుగా మారుతుందని, తద్వారా ముఖంపై మొటిమలు, మచ్చలు ఏర్పడతాయంటున్నారు నిపుణులు. అయితే సీబమ్? ఉత్పత్తిని క్రమబద్ధీకరించి.. జిడ్డుదనాన్ని తొలగించడంలో పసుపు నూనె కీలక పాత్ర పోషిస్తుందని, తద్వారా మొటిమల సమస్య తగ్గే అవకాశం ఉందని వివరిస్తున్నారు. ఎందుకంటే పసుపు వేళ్ల నుంచి తీసిన ఎసెన్షియల్ ఆయిల్‌లో యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉన్నాయని.. అవి మొటిమలు, మచ్చల్ని దూరం చేస్తాయంటున్నారు నిపుణులు.వృద్ధాప్య ఛాయలకు చెక్: ఈ నూనెలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయంటున్నారు నిపుణులు. దీని కోసం నాలుగు చెంచాల బాదం నూనెలో నాలుగు చుక్కల పసుపు ఎసెన్షియల్ ఆయిల్ వేసి బాగా కలపి.. ఈ మిశ్రమాన్ని సన్నని గీతలు, ముడతలు ఉన్నచోట అప్లై చేసి మృదువుగా మసాజ్? చేయాలంటున్నారు. ఈ చిట్కాను రోజూ రాత్రి పడుకునే ముందు పాటిస్తే చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు.కురులకు కూడా:పసుపు నూనె వల్ల చర్మానికే కాదు, కురులకు కూడా చక్కని ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు నిపుణులు. చుండ్రుని నివారించడంతో పాటు జుట్టు రాలడాన్ని అరికట్టడంలోనూ ఇది సహాయపడుతుందని వివరిస్తున్నారు. అలాగే, దీనిలో యాంటీ ఫంగల్ గుణాలు ఉండడం వల్ల ఇవి కుదుళ్లలో ఎలాంటి ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడతాయని అంటున్నారు.ఈ జాగ్రత్తలు తప్పనిసరి: ఇన్ని ప్రయోజనాలు ఉన్న పసుపు నూనెను ఉపయోగించే ముందు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలంటున్నారు సౌందర్య నిపుణులు. అవేంటంటే..ఈ నూనెను నేరుగా చర్మం లేదా కురులపై ని, కొబ్బరి, బాదం, జొజోబా వంటి నూనెలతో కలిపి మాత్రమే వినియోగించాలని సూచిస్తున్నారు.
ఈ నూనెను తక్కువ మోతాదులోనే ఉపయోగించాలని చెబుతున్నారు.ఈ నూనెను ఉపయోగించిన తర్వాత చర్మం చాలా సున్నితంగా తయారవుతుందని, కాబట్టి ఎండలోకి వెళ్లే వారు సన్‌స్క్రీన్ రాసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.చివరగా.. ఈ నూనెను వాడే ముందు ఓసారి సౌందర్య నిపుణుల సలహా తీసుకోవడం, ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం

మీ భార్య లేదా భర్త ప్రవర్తనలో "మార్పులు" వచ్చాయా - రిలేషన్‌లో మూడో వ్యక్తి ఉన్నట్లేనట!

: ఎప్పుడు, ఎక్కడ, ఎవరి మీద పుడుతుందో చెప్పలేని భావం 'ప్రేమ'. ఈ లవ్? భార్యాభర్తల మధ్య ఉంటే వాళ్ల బంధం కలకాలం నిలిచి ఉంటుంది. కానీ ప్రేమ పేరుతో మూడో వ్యక్తిపై కలిగే వ్యామోహం చాలా జంటల మధ్య చిచ్చు పెడుతుంది. దీని కారణంగానే విడాకులు ఇచ్చుకోవడం, ఒకరిని ఒకరు చంపుకోవడం వంటివి ప్రస్తుత సమాజంలో ఎక్కువయ్యాయి. అయితే ప్రతి చిన్న విషయానికీ భాగస్వామిపై అనుమానం పెంచుకోకుండా.. వారు చేసే కొన్ని పనులు, ప్రవర్తన ఆధారంగా వారి జీవితంలో మూడో వ్యక్తి ఉన్నారో? లేదో? గుర్తించవచ్చంటున్నారు రిలేషన్‌షిప్ నిపుణులు. అదెలాగో ఇప్పుడు చూద్దాం.
ప్రతిదీ రహస్యమేనా?: భార్యాభర్తల మధ్య ఎలాంటి రహస్యాలూ ఉండకూడదంటుంటారు. ఎందుకంటే ప్రతి విషయం గురించి ఇద్దరికీ తెలిస్తేనే అనుమానాలకు తావు లేకుండా అన్యోన్యంగా ముందుకు సాగుతారు. అయితే ఉన్నట్లుండి తమ పార్ట్?నర్? ప్రవర్తనలో మార్పులు ఏమైనా వచ్చినా, ప్రతీ విషయంలో రహస్యంగా ప్రవర్తించినా అనుమానించడంలో తప్పు లేదని చెబుతున్నారు నిపుణులు.
ఆ చిరాకు మీపై రుద్దితే..!: దాంపత్య బంధంలో చిరాకు, పరాకులు సహజం. ఈ క్రమంలోనే కొన్నిసార్లు ఒకరిపై ఒకరు చిరాకు పడటం, కాసేపయ్యాక కలిసిపోవడం.. ఇది సహజంగా జరిగే ప్రాసెస్?. అయితే అలా కాకుండా భార్యా/భర్త కనిపిస్తే చిరాకు పడడం, లవర్? కనిపించకపోయినా, మాట్లాడకపోయినా.. ఆ చిరాకునూ మీపై రుద్దడం, ఇలా ఎటుతిరిగీ



మిమ్మల్ని ఓ దోషిగా చిత్రీకరించాలన్న ఉద్దేశంతో మీపై లేనిపోని నిందలు వేయడం, బాధపెట్టడం చేసినట్లయితే.. అలర్ట్? కావాలంటున్నారు. ఎందుకంటే మీ భాగస్వామి మిమ్మల్ని వదిలించుకోవాలని చూస్తున్నారన డానికి ఇవి సంకేతమంటున్నారు. కాబట్టి ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలంటున్నారు.. మీ పార్టనర్? విషయంలో ఏమైనా అనుమానంగా అనిపిస్తే దాన్ని నివృత్తి చేసుకొని అడుగు ముందుకేయడం మంచిదంటున్నారు.
పదే పదే తన ప్రస్తావనే!: భార్యాభర్తలంటే.. ఒకరిలో ఒకరికి నచ్చిన అంశాలు, పిల్లల భవిష్యత్తు, ఆఫీసు విషయాలు, రొమాంటిక్? మాటలు మాట్లాడుకోవాలి. అలాకాకుండా సమయం సందర్భం లేకుండా, ప్రస్తావన వచ్చినా, రాకపోయినా పార్టనర్? మరో వ్యక్తి గురించి పదే పదే మాట్లాడుతున్నా, వారిలోని మంచి విషయాలు చెబుతూ ఎమోషన్? అయినా, ఆ వ్యక్తి పట్ల ప్రత్యేకమైన ఆసక్తి ఉందేమోనని అనుమానించడంలో తప్పు లేదంటున్నారు.మిమ్మల్ని దూరం పెడుతూ: అప్పటిదాకా ప్రతి విషయంలో మీకు, మీ నిర్ణయాలకు విలువ ఇచ్చినవారు.. సడెన్?గా దూరం పెట్టినప్పుడు అనుమానం రావడం కామన్?. ముఖ్యంగా ఫైనాన్స్? విషయాల్లో గోప్యత పాటించడం, కీలక విషయాల్లో సైతం నిర్ణయం అడగకపోవడం, కలిసి సమయం గడుపుదామని ఆసక్తి చూపినా ఇంట్రస్ట్? చూపించకపోవడం, ఏకాంతంగా ఉండాల్సిన సమయంలోనూ దూరం పెట్టడం వంటి సందర్భాలు మీకంటే మరో వ్యక్తికి ప్రాధాన్యమిస్తున్నారనడానికి సంకేతంగా

భారత క్రికెట్‌కు వైభవ్ సూర్యవంశీ మంచి పెట్టుబడి!



- యువ ఆటగాడిపై దిగ్గజ క్రికెటర్ సనత్ జయసూర్య ప్రశంసలు.. సహజసిద్ధమైన ఆటకు స్వేచ్ఛనివ్వాలని సూచన

టీమిండియా యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీపై శ్రీలంక క్రికెట్ దిగ్గజం సనత్ జయసూర్య ప్రశంసల వర్షం కురిపించారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే తన అద్భుతమైన బ్యాటింగ్‌తో క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న వైభవ్ భారత క్రికెట్ భవిష్యత్తుకు మంచి పెట్టుబడి అని అభివర్ణించారు. అతడిపై ఒత్తిడి పెంచకుండా సహజసిద్ధమైన ఆటతీరుతో ఆడేందుకు అవకాశం కల్పించాలని సూచించారు.ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రికెట్ లీగ్‌లో ముంబై రాయల్స్, మహారాష్ట్ర సూపర్ స్ట్రైకర్స్ జట్ల జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న జయసూర్య మీడియాతో మాట్లాడారు. వైభవ్ ఇంకా ఎంతోకాలం క్రికెట్ ఆడాలని, తన ప్రతిభను మరింతగా మెరుగుపరుచుకోవాలని ఆకాంక్షించారు. చిన్న వయసులోనే అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకుంటున్న అతడికి తగిన ప్రోత్సాహం అందిస్తే భారత క్రికెట్‌కు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.**అభిషేక్ శర్మపై ప్రశంసలు**టీమిండియా యువ ఆటగాడు అభిషేక్ శర్మను కూడా జయసూర్య ప్రశంసించారు. అతడు సమర్థవంతమైన ఆల్‌రౌండర్ అని, మైదానంలో ఎక్కడైనా తన ప్రతిభను ప్రదర్శించగలడని కొనియాడారు. భారత జట్టులో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదని అన్నారు.ఇంగ్లండ్‌తో ట్రై సిరీస్ ఫైనల్‌లో పాకిస్తాన్‌తో తలపడనున్న శ్రీలంక జట్టుకు ఈ ప్రదర్శనలు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వైట్‌బాల్ క్రికెట్‌లో బ్యాటర్ల ఆధిపత్యం పెరగడాన్ని స్వాగతించారు. ఇటీవల ఇంగ్లండ్‌పై 430 పరుగుల లక్ష్యాన్ని శ్రీలంక ఛేదించడం క్రికెట్‌లో పెరుగుతున్న బ్యాటింగ్ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.

పాక్ ప్రధాని షరీఫ్‌పై నెటిజన్ల ట్రోల్స్!



● ఆరు ఓవర్ల మ్యాచ్ విజయానికే ఇంత హడావుడా? సోషల్ మీడియాలో వ్యంగ్య వ్యాఖ్యలు

పాకిస్తాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ సోషల్ మీడియాలో నెటిజన్ల ట్రోలింగ్‌కు గురయ్యారు. భారత్‌తో జరిగిన హాంకాంగ్ సిక్సెస్ క్రికెట్ టోర్నీ మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు విజయం సాధించడంతో ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఈ విజయంపై షరీఫ్ హర్షం వ్యక్తం చేస్తూ పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు అభినందనలు తెలిపారు. జట్టు ఆటతీరును ప్రశంసించడంతో పాటు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీని కూడా అభినందించారు.అయితే ప్రధాని స్పందనపై సామాజిక మాధ్యమాల్లో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. హాంకాంగ్ సిక్సెస్ అనేది సాధారణ క్రికెట్ మ్యాచ్‌లకు భిన్నంగా ఆరు ఓవర్లపాటు జరిగే ప్రత్యేక టోర్నమెంట్ అని, ఇందులో సాధించిన విజయానికి ఇంతటి ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటంటూ పలువురు నెటిజన్లు వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి ప్రధాన క్రికెట్ మ్యాచ్‌ల విజయాలతో పోల్చుతూ షరీఫ్ స్పందనను ఎగతాళి చేశారు. మరికొందరు పాకిస్థాన్ జట్టు విజయాన్ని అభినందించడంలో తప్పులేదని అభిప్రాయపడ్డారు. మొత్తంగా భారత్‌పై పాకిస్థాన్ సాధించిన విజయం కంటే ప్రధాని షరీఫ్ చేసిన వ్యాఖ్యలే సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ చర్చకు దారితీశాయి.

సంజును తప్పించకుండానే వైభవ్‌కు ఛాన్స్!

దినేశ్ కార్తీక్ మాస్టర్ ప్లాన్.. అభిషేక్ శర్మకు విశ్రాంతి ఇవ్వాలని సూచన



భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో చివరి మ్యాచ్‌కు ముందు టీమిండియా తుది జట్టు ఎంపిక ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే 3-1తో సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత జట్టు చివరి మ్యాచ్‌లోనూ విజయం సాధించి సిరీస్‌ను ఘనంగా ముగించాలని భావిస్తోంది. అయితే యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి మరో అవకాశం కల్పించాలా? సీనియర్ ఆటగాడు సంజు శాంసన్‌ను కొనసాగించాలా? అనే చర్చ క్రికెట్ వర్గాల్లో జోరుగా సాగుతోంది.ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ ఆసక్తికరమైన సూచన చేశారు. వైభవ్ సూర్యవంశీని తుది జట్టులోకి తీసుకోవాలంటే సంజు శాంసన్‌ను తప్పించాల్సిన అవసరం లేదని, అభిషేక్ శర్మకు విశ్రాంతి కల్పించి వైభవ్‌కు అవకాశం ఇవ్వవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రతిసారీ వైభవ్‌కు అవకాశం కల్పించే అంశం వచ్చినప్పుడు సంజు శాంసన్‌నే ఎందుకు తప్పించాలనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. సిరీస్ ఇప్పటికే భారత్ సొంతం కావడంతో చివరి మ్యాచ్‌లో ఆటగాళ్లకు విశ్రాంతి కల్పిస్తూ కొత్త కూర్పులను పరీక్షించవచ్చని సూచించారు. **అర్ష్‌దీప్‌కు విశ్రాంతి.. యువ బౌలర్లకు అవకాశం**బౌలింగ్ విభాగంలోనూ మార్పులు చేయవచ్చని కార్తీక్ పేర్కొన్నారు. అక్షర్ పటేల్‌ను జట్టులో కొనసాగిస్తూ, ఈ సిరీస్‌లో అద్భుతంగా రాణించిన అర్ష్‌దీప్ సింగ్‌కు విశ్రాంతి ఇవ్వవచ్చన్నారు. అతడి స్థానంలో మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్ వంటి యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించాలని సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా అదనపు స్పిన్నర్‌ను పరీక్షించడం కూడా ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. మరోవైపు, వైభవ్ సూర్యవంశీ గత మ్యాచ్‌ల్లో చూపిన దూకుడైన బ్యాటింగ్ అభిమానుల్లో అంచనాలను పెంచింది. మూడో టీ20లో 19 బంతుల్లో 45 పరుగులు చేసి తన సత్తా చాటాడు. గాయంతో దూరమైన ఇషాన్ కిషన్ తిరిగి జట్టులోకి రావడంతో నాలుగో మ్యాచ్‌లో వైభవ్‌కు చోటు దక్కలేదు. ఈ నేపథ్యంలో చివరి టీ20లో అతడికి అవకాశం లభిస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. కార్తీక్ సూచించిన మార్పులను జట్టు యాజమాన్యం పరిశీలిస్తుందా? అనేది మ్యాచ్‌లో తుది జట్టు ప్రకటనతో తేలనుంది.

హార్దిక్ పాండ్య కోసం భారీ ట్రేడ్ డీల్!

● శివమ్ దూబె, ఆయుశ్ మాత్రేను కోరుతున్న ముంబై ఇండియన్స్?.. సీఎస్కేకు అశ్విన్ కీలక సూచనలు



చెన్నై: ఐపీఎల్‌లో ఆటగాళ్ల ట్రేడింగ్‌పై ఇప్పటి నుంచే ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ముఖ్యంగా భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యను ముంబై ఇండియన్స్ నుంచి చెన్నై సూపర్ కింగ్స్‌కు తీసుకురావాలనే ఊహాగానాలు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.హార్దిక్ పాండ్య వంటి విలువైన ఆటగాడిని జట్టులోకి తీసుకోవాలంటే చెన్నై సూపర్ కింగ్స్ భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా శివమ్ దూబెతో పాటు యువ ఆటగాడు ఆయుశ్ మాత్రేను కూడా ట్రేడ్‌లో భాగంగా ఇవ్వాల్సి రావచ్చని పేర్కొన్నాడు. హార్దిక్ సేవలు పొందాలంటే ముంబై ఇండియన్స్ కోరే ఆటగాళ్ల విషయంలో సీఎస్కే సిద్ధంగా ఉండాలని సూచించాడు. **దూబెతో పాటు యువ ఆటగాడిపైనా కన్ను!**చెన్నై జట్టులో శివమ్ దూబె కీలక బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ భారీ షాట్లు ఆడగల సామర్థ్యం అతడి సొంతం. మరోవైపు యువ ఆటగాడు ఆయుశ్ మాత్రే భవిష్యత్తులో జట్టుకు ఉపయోగపడే ప్రతిభావంతుడిగా గుర్తింపు పొందుతున్నాడు. ఇలాంటి ఇద్దరు ఆటగాళ్లను వదులుకోవడం సీఎస్కేకు అంత సులభమైన విషయం కాదు. అయితే హార్దిక్ వంటి ఆల్‌రౌండర్ జట్టులో ఉంటే బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకం పెరుగుతుందని క్రికెట్ విశ్లేషకుల అభిప్రాయం.**ఇతర ఆటగాళ్లతోనూ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు**హార్దిక్ పాండ్య ట్రేడ్ వ్యవహారంలో మరో ప్రత్యామ్నాయంగా శివమ్ దూబె, నాథన్ ఎల్లిస్, ఉర్విల్ పటేల్ వంటి ఆటగాళ్లను కలిపి ప్రతిపాదించే అవకాశాన్ని కూడా అశ్విన్ ప్రస్తావించినట్లు కథనం పేర్కొంది. అలాగే హార్దిక్‌తో పాటు దీపక్ చాహర్‌ను కూడా తీసుకునే అంశాన్ని పరిశీలించవచ్చనే అభిప్రాయాన్ని వెల్లడించాడు. దీంతో ఈ ట్రేడ్ వ్యవహారం ఐపీఎల్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.అయితే హార్దిక్ పాండ్య జట్టు మార్పుపై ఇప్పటివరకు ముంబై ఇండియన్స్ లేదా చెన్నై సూపర్ కింగ్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అశ్విన్ చేసినవి ప్రతిపాదనలు, క్రికెట్ విశ్లేషణలో భాగమైన అభిప్రాయాలు మాత్రమే. నిజంగా ఈ ట్రేడ్ కార్యరూపం దాల్చుతుందా? సీఎస్కే కీలక ఆటగాళ్లను వదులుకుంటుందా? అన్నది వేచి చూడాలి.

భారత మహిళల క్రికెట్‌కు స్వర్ణోత్సవం



- తొలి టెస్టు మ్యాచ్‌కు 50 ఏళ్లు.. చరిత్రను గుర్తుచేసిన బీసీసీఐ

బెంగళూరు, అక్టోబర్ 31: భారత మహిళల క్రికెట్ చరిత్రలో అక్టోబర్ 31 చిరస్మరణీయమైన రోజు. సరిగ్గా 50 ఏళ్ల క్రితం 1976 అక్టోబర్ 31న బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియం వేదికగా భారత మహిళల జట్టు వెస్టిండీస్‌తో తన తొలి అధికారిక టెస్టు మ్యాచ్ ఆడింది. ఈ చారిత్రక ఘట్టానికి ఐదు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రత్యేకంగా స్పందించింది. అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేస్తూ సామాజిక మాధ్యమాల్లో ప్రత్యేక పోస్టును విడుదల చేసింది. అలాగే భారత మహిళల జట్టుకు నాయకత్వం వహించిన మాజీ కెప్టెన్లను సత్కరించింది.ఆ తొలి టెస్టులో 17 ఏళ్ల యువ లెగ్ స్పిన్నర్ శుభాంగి కులకర్ణి తన అరంగేట్రంలోనే అద్భుత ప్రదర్శన చేసింది. ఐదు వికెట్లు పడగొట్టి వెస్టిండీస్ జట్టును 274 పరుగులకే పరిమితం చేయడంలో కీలక పాత్ర పోషించింది. మరోవైపు భారత కెప్టెన్ శాంతా రంగస్వామి తన బ్యాటింగ్‌తో ప్రత్యేక గుర్తింపు పొందారు. వెస్టిండీస్ బౌలర్ ప్యాట్రిషియా విటేకర్ బౌలింగ్‌లో భారీ సిక్స్ బాదారు. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత మహిళా క్రికెటర్ సాధించిన తొలి సిక్స్‌గా ఇది చరిత్రలో నిలిచిపోయింది. భారత్ 269/6 స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి విజయం కోసం ప్రయత్నించినప్పటికీ, చివరి రోజు ఆట ఆలస్యంగా ప్రారంభం కావడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.**ఎన్నో కష్టాలను అధిగమించి.. ప్రపంచ స్థాయికి**నాటి నుంచి నేటి వరకు భారత మహిళల క్రికెట్ ఎన్నో మైలురాళ్లను అధిగమించింది. ప్రారంభ దశలో పరిమిత వనతులు, ఆర్థిక ఇబ్బందులు, తగిన గుర్తింపు లేకపోవడం వంటి సవాళ్లను ఎదుర్కొంటూ మహిళా క్రికెటర్లు ఆటను కొనసాగించారు. వారి కృషి, పట్టుదలతోనే నేడు భారత మహిళల క్రికెట్ ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్ వంటి స్టార్ క్రీడాకారిణులు తమ ప్రతిభతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. బీసీసీఐ కాంట్రాక్టులు, మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్), ప్రకటనల ద్వారా నేటి క్రీడాకారిణులకు మరిన్ని అవకాశాలు లభిస్తున్నాయి.**లార్డ్స్ మైదానంలోనూ చారిత్రక విజయం**మహిళల క్రికెట్ ప్రస్థానంలో మరో కీలక ఘట్టం లార్డ్స్ మైదానంలో చోటుచేసుకుంది. క్రికెట్‌కు పుట్టినిల్లుగా పేరొందిన లార్డ్స్‌లో తొలిసారిగా జరిగిన మహిళల టెస్టు మ్యాచ్‌లో భారత్ ఇంగ్లండ్‌పై 270 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ విజయం ప్రపంచ క్రికెట్‌లో భారత మహిళా జట్టు సత్తాను చాటింది. ఐదు దశాబ్దాల క్రితం తొలి టెస్టుతో ప్రారంభమైన ప్రయాణం నేడు అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో విజయాలకు బాటలు వేసింది. ఈ స్వర్ణోత్సవం సందర్భంగా నాటి మహిళా క్రికెటర్ల త్యాగాలు, పోరాటం, అంకితభావాన్ని క్రికెట్ అభిమానులు గుర్తుచేసుకుంటున్నారు.



ద్వంద్వ ప్రమాణాలపై అనుపమ ఆవేదన

యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ సోషల్ మీడియాలో పెట్టిన ఒక ఎమోషనల్ పోస్ట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మనుషుల ప్రవర్తనలోని ద్వంద్వ ప్రమాణాలపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించనప్పటికీ, ఆమె వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.“ఒకప్పుడు మిమ్మల్ని తప్పు చేసినట్టు భావించేలా చేసిన పనులే, పాత్రలు తారుమారైనప్పుడు సర్వసాధారణంగా మారడం విచిత్రంగా ఉంటుంది“ అంటూ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో అనుపమ పేర్కొన్నారు. సంతోషంగా ఉండటం, ఇష్టమైన వారిని మెచ్చుకోవడం వంటి చిన్న చిన్న విషయాలను కూడా తప్పుగా చిత్రీకరించారని, పదేపదే వివరణలు ఇచ్చుకునేలా చేసి, క్షమాపణలు చెప్పే స్థితికి నెట్టారని ఆమె వాపోయారు.

అయితే, అవే పనులను ఇప్పుడు ఇతరులు ఎలాంటి మొహమాటం లేకుండా బహిరంగంగా చేస్తున్నారని, దీన్నిబట్టి “సమస్య మనం ఏం చేశామన్నది కాదు, అది ఎవరు చేశారన్నదే ముఖ్యం“ అని తనకు అర్థమైందని ఆమె తెలిపారు.ఈ సందర్భంగా తన ఫాలోవర్స్‌కు కూడా అనుపమ ఒక విజ్ఞప్తి చేశారు. ఎవరి కామెంట్‌కు రిప్లై ఇచ్చానో పోల్చి చూస్తూ తనకు ట్యాగ్‌లు, మెసేజ్‌లు పెట్టవద్దని కోరారు. “నాకు సోషల్ మీడియాకు అతీతంగా సొంత బాధ్యతలు, పోరాటాలు ఉన్నాయి. ఒత్తిడి కోసం ఆన్‌లైన్‌లో నటిస్తూ బతకలేను“ అని ఆమె స్పష్టం చేశారు. కొద్ది రోజుల క్రితం ఒక ప్రేమ వ్యవహారం వల్ల మానసిక ప్రశాంతత కోల్పోయానని చెప్పిన అనుపమ, ఇప్పుడు ఈ పోస్ట్ పెట్టడంతో ఇది ఎవరిని ఉద్దేశించిందనే చర్చ జరుగుతోంది.

‘ఆర్‌సీ17‘లో చరణ్ సరసన తెలుగమ్మాయి?..

ఎవరీ సాత్విక వీరవల్లి?

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో ‘రంగస్థలం’ వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత రాబోతున్న పాన్ ఇండియా చిత్రం ‘ఆర్‌సీ17‘పై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ ముహూర్తపు పూజా కార్యక్రమాలు నవంబర్ 1న వైభవంగా జరగనున్నాయి. సినిమా సెట్స్‌పైకి వెళ్లేందుకు సర్వం సిద్ధమవుతున్న ఈ తరుణంలో చిత్ర కథానాయిక ఎంపిక టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ రేసులో ఎందరో ప్రముఖ నటీమణులను వెనక్కి నెట్టి, అమెరికాలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి సాత్విక వీరవల్లికి అవకాశం దక్కినట్లు బలమైన ప్రచారం జరుగుతోంది.‘ఆర్‌సీ17‘ ప్రకటన వెలువడిన నాటి నుంచే హీరోయిన్ ఎవరనే దానిపై అనేక ఊహాగానాలు వినిపించాయి. గతంలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా మెప్పించి, ‘ధురంధర్’ సిరీస్‌తో విజయాలు అందుకున్న సారా అర్జున్‌తో పాటు రుక్మిణి వసంత్, అనీత్ పడ్డ, అనస్వర రాజన్ వంటి యువ నటీమణుల పేర్లు ప్రముఖంగా పరిశీలనలో ఉన్నట్లు వార్తలొచ్చాయి. అయితే, దర్శకుడు సుకుమార్ తనదైన శైలిలో కథలోని గ్రామీణ వాతావరణానికి, పాత్రలోని సహజత్వానికి సరిగ్గా సరిపోయే కొత్త ముఖం కోసం అన్వేషించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన దృష్టి సాత్విక వీరవల్లిపై పడినట్లు సమాచారం. ఇప్పటికే ఆమె స్క్రీన్ టెస్ట్, నటన పట్ల చిత్ర బృందం సంతృప్తిగా ఉందని, రామ్ చరణ్ సరసన ఆమె ఎంపిక దాదాపు ఖరారైందని ఫిల్మ్‌నగర్ వర్గాలు కోడై కూస్తున్నాయి.



అందరి దృష్టి సాత్విక వీరవల్లిపైనే!

ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తున్న సాత్విక వీరవల్లి బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆమె అమెరికాలో జన్మించినప్పటికీ, ఆమె కుటుంబ మూలాలు తమిళనాడులోని చెన్నైకి చెందిన తెలుగు కుటుంబానికి సంబంధించినవి. చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సాత్విక, అమెరికాలోని ప్రఖ్యాత యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్, వాండర్‌బిల్ట్ యూనివర్సిటీల నుంచి ఇంజనీరింగ్ పట్టాలు అందుకున్నారు. విద్యతో పాటు భారతీయ శాస్త్రీయ నృత్యంలోనూ ప్రావీణ్యం సంపాదించారు. నటనపై ఉన్న ఆసక్తితో చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె, ఇప్పటికే దర్శకుడు పవన్ సాదినేని దర్శకత్వంలో, ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న ‘ఆకాశంలో ఒక తార’ చిత్రంలో హీరోయిన్‌గా చేస్తున్నారు. తొలి సినిమా విడుదల కాకముందే, రామ్ చరణ్-సుకుమార్ వంటి భారీ పాన్-ఇండియా కాంబినేషన్‌లో అవకాశం దక్కించుకోవడం సాత్విక కెరీర్‌కు ఒక మైలురాయిగా నిలవనుంది. సుకుమార్ మార్క్ భావోద్వేగాలు, చరణ్ మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో రానున్న ఈ చిత్రంలో తెలుగమ్మాయికి అవకాశం దక్కడంపై సినీ ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. నవంబర్ 1న జరగనున్న పూజా కార్యక్రమాల్లో కథానాయిక ఎవరనే దానిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నందున, ఈ వార్తలపై పూర్తి స్పష్టత కోసం మరికొన్ని గంటలు వేచి చూడక తప్పదు

‘ఐఫా’లో 12 అవార్డులతో సత్తా చాటిన ‘ధురంధర్’.. ఉత్తమ నటుడిగా రణ్‌వీర్ సింగ్

భారత చలనచిత్ర రంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే 26వ అంతర్జాతీయ భారత ఫిల్మ్ అకాడమీ (ఐఫా) అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన స్పై-యాక్షన్ థ్రిల్లర్ ‘ధురంధర్’ చిత్రం తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఏకంగా 12 అవార్డులను కైవసం చేసుకుని ఈ ఏడాది ఐఫాలో అతిపెద్ద విజేతగా నిలిచింది. ఈ చిత్రంలో అద్భుతమైన నటనకు గాను రణ్‌వీర్ సింగ్ ఉత్తమ నటుడిగా అవార్డును గెలుచుకున్నారు. ‘ధురంధర్’ చిత్రానికి ఉత్తమ చిత్రంతో పాటు దర్శకుడిగా ఆదిత్య ధర్‌కు అవార్డు లభించింది. అంతేగాక ఉత్తమ ఒరిజినల్ కథ, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ సంభాషణల విభాగాల్లోనూ ఆదిత్య ధర్ అవార్డులు గెలుచుకోవడం విశేషం. ఇదే చిత్రంలో నటనకు గాను సంజయ్ దత్ ఉత్తమ సహాయ నటుడిగా, అక్షయ్ ఖన్నా ఉత్తమ



ప్రతినాయకుడిగా ఎంపికయ్యారు. ఉత్తమ సంగీత దర్శకుడిగా శాశ్వత్ సచ్‌దేవ్‌కు కూడా ‘ధురంధర్’ చిత్రానికే అవార్డు దక్కింది.మరోవైపు ‘సైయారా’ చిత్రంలో అద్భుతమైన నటన కనబరిచిన అనీత్ పడ్డా ఉత్తమ నటి (ప్రధాన పాత్ర) అవార్డును సొంతం చేసుకున్నారు. ‘జాలీ ఎల్ఎల్‌బీ 3’ చిత్రంలో నటనకు హ్యూమా ఖురేషి ఉత్తమ సహాయ నటిగా నిలిచారు. సంగీత విభాగంలో ‘సైయారా’ చిత్రం పలు అవార్డులు గెలుచుకుంది. ఈ చిత్రంలోని పాటకు ఇర్షాద్ కమిల్ ఉత్తమ గేయ రచయితగా, ఫహీమ్ అబ్దుల్లా ఉత్తమ నేపథ్య గాయకుడిగా, శ్రేయా ఘోషల్ ఉత్తమ నేపథ్య గాయనిగా అవార్డులు అందుకున్నారు. కాగా, ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ‘అవతార్: ఫైర్ & యాష్’ ఉత్తమ అంతర్జాతీయ చిత్రంగా ఎంపికైంది.

డిజిటల్ విభాగంలోనూ ఆసక్తికర ఫలితాలు వెలువడ్డాయి. షారుఖ్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ దర్శకత్వం వహించిన ‘ది బాడ్స్ ఆఫ్ బాలీవుడ్’ ఉత్తమ వెబ్ సిరీస్‌గా, ఉత్తమ దర్శకత్వ సిరీస్‌గా రెండు అవార్డులను గెలుచుకుంది. విమర్శకుల ప్రశంసలు పొందిన ‘పాతాళ్ లోక్ సీజన్ 2’ సిరీస్‌లో నటనకు గాను జైదీప్ అహ్లావత్ ఉత్తమ నటుడిగా, తిలోత్తమ షోమ్ ఉత్తమ నటిగా అవార్డులు అందుకున్నారు.

సుకేశ్ కేసు: నటి నోరా ఫతేహీకి ఢిల్లీ హైకోర్టు సమన్లు

బాలీవుడ్ నటి, డ్యాన్సర్ నోరా ఫతేహీకి ఢిల్లీ హైకోర్టు సమన్లు జారీ చేసింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సుకేశ్ చంద్రశేఖర్ రూ. 200 కోట్ల మనీలాండరింగ్, దోపిడీ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున సాక్షిగా హాజరుకావాలని ఆదేశించింది. నవంబర్ 2న వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరు కావాలని స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించి దాఖలు చేసిన మూడో అనుబంధ ఛార్జిషీట్‌లో నోరా ఫతేహీని ప్రాసిక్యూషన్ విట్నెస్ గా చేర్చారు.సీనియర్ అధికారులమంటూ బెదిరింపులకు పాల్పడిన సుకేశ్ చంద్రశేఖర్... 2020-21 మధ్య ఢిల్లీలోని రోహిణి జైలు నుంచే ఓ పెద్ద దోపిడీ రాకెట్‌ను నడిపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. రాన్‌బాక్సీ మాజీ ప్రమోటర్ శివిందర్ మోహన్ సింగ్ భార్య అదితి సింగ్‌ను టార్గెట్ చేసి, జైలులో ఉన్న ఆమె భర్తను విడిపిస్తానని నమ్మించి ఆమె నుంచి దాదాపు రూ. 200 కోట్లు వసూలు చేశాడనే ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం విచారణ జరిపి... మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్ కింద అభియోగాలు నమోదు చేసింది.ఈ కేసు విచారణలో భాగంగా గతంలోనే ఆర్థిక నేరాల విభాగం అధికారులు నోరా ఫతేహీని సుదీర్ఘంగా ప్రశ్నించారు. సీఆర్‌పీసీ సెక్షన్ 164 కింద ఆమె వాంగ్మూలాన్ని కూడా నమోదు చేశారు. తనకు సుకేశ్‌తో నేరుగా పరిచయం లేదని, అతని భార్య లీనా మరియా పాల్ ద్వారానే మాట్లాడానని నోరా అధికారులకు తెలిపారు. 2020 డిసెంబర్‌లో చెన్నైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి కేవలం వృత్తిపరంగానే హాజరయ్యానని ఆమె వివరించారు.

